





# సూర్య


నేటి దినపత్రిక

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

బుధవారం | 25 ఫిబ్రవరి 2026 | విజయవాడ








సంపుటి 19 | సంచిక 127


| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



## మార్కాపురానికి జిల్లా కళ - వెలిగొండతో జలకళ

## హార్టికల్చర్‌తో రైతు జీవితాలు కళకళ




ఎన్నికల్లో మాటిచ్చినట్లు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి... ప్రజల 5 దశాబ్దాల కలను నెరవేర్చాం.
ఈ ఏడాదే వెలిగొండ మొదటి ఫేజ్ పూర్తి చేసి కరువు ప్రాంతంలో జలకళ తెస్తాం.
హార్టికల్చర్ సాగుతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపి జీవన ప్రమాణాలు పెంచుతాం.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

### గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే

### నేడు రూ.456 కోట్లతో చేపడుతున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం

**స్థలం :** గంటావానిపల్లె, పెద్దదోర్నాల మండలం | **సమయం :** ఉదయం 11 గంటలకు

### భారీ బహిరంగ సభ

**స్థలం :** మార్కాపురంలోని శ్రీ సాయి బాలాజీ మోడల్ స్కూల్ ఎదురుగా

**తేదీ :** 25-02-2026 | **సమయం :** మధ్యాహ్నం 2 గంటలకు



జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**సాగునీరు సేద్యానికి జీవం... ఉద్యానవన పంట రైతుకు వరం**







# కల్తీ నెయ్యి దోషులు తప్పించుకోలేరు

● తిరుమల కల్తీ నెయ్యి కుట్రను సభలో బట్టబయలు చేసిన సీఎం ● 59.71 లక్షల లీటర్ల సరఫరా, 20 కోట్లకు పైగా లడ్డూల తయారీ ●టెండర్ నిబంధనల మార్పులు, ల్యాబ్ రిపోర్టుల తొక్కిపెట్టింపుతో శ్రీవారికి ఘోర అపచారం. ●దర్యాప్తులో లంచాల డైరీ, రసాయనాల వినియోగం వెలుగులోకి .. ●దేవాలయాలపై దాడులకు ఇక ఉపేక్షించేదిలేదు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి ● తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కుట్రపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో జరిగిన లఘు చర్చలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విస్తృతంగా స్పందించారు. సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 2019--24 మధ్య టీటీడీలో జరిగిన పరిణామాలను, కల్తీ నెయ్యి బండారం ఎలా బయటపడిందో వివరించారు. "ఎవరికి ఏ బాధ వచ్చినా వేంకటేశ్వరస్వామిని మొక్కుకుంటాం. ఆయనపై జరిగిన అపచారం పట్ల ఎన్నోసార్లు ఆవేదన చెందాం. దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని చెప్పి పోరాడితే కేసులు పెట్టి వేధించారు. అందులో నేనూ బాధితుడినే," అని సీఎం అన్నారు. రామతీర్థం ఘటనను ప్రస్తావిస్తూ, అక్కడికి వెళ్లినందుకు తనపై కేసులు పెట్టారని గుర్తుచేశారు.


అధికారంలోకి రాగానే ప్రక్షాళన చర్యలు : తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సంతకం ప్రిన్సిపల్ సెక్రటరీ నియామకంపై, రెండోది టీటీడీ ఈవో నియామకం పై చేశానన్నారు. నాకు నెయ్యి అంశంపై వచ్చిన సమాచారం నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు నివేదిక ఆధారంగానే ఎన్డీయే సమావేశంలో ప్రస్తావించాను, అని తెలిపారు. టీటీడీలో నెయ్యి నాణ్యతపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో నమూనాలు పరీక్షలకు పంపగా, జూలై 23, 2024న వచ్చిన ఎన్డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉన్నట్టు వెల్లడైందన్నారు. ఆ ఆధారాలతోనే కల్తీ జరిగిందని ప్రకటించానని చెప్పారు.

59.71 లక్షల లీటర్ల సరఫరా- రూ.234 కోట్ల వ్యయం : సీఎం వివరాల ప్రకారం 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి సరఫరా చేసి దానికి రూ.234 కోట్లు ఖర్చు చేశారు. సుమారు 20.01 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేసి విక్రయించారని తెలిపారు. ఈ అంశం బయటపడిన తర్వాత సిట్ వేయాలని నిర్ణయించగా, దానిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆధ్వర్యంలో సిట్ దర్యాప్తు చేపట్టిందని, దర్యాప్తులో తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నివేదిక ఇచ్చిందన్నారు. టీటీడీలో సాంకేతిక, పరిపాలనా మార్పులు చేయాలని సూచించిందని తెలిపారు.

టెండర్ నిబంధనల మార్పులు- ల్యాబ్ రిపోర్టుల తొక్కిపెట్టింపు : 2020 జనవరి, ఫిబ్రవరిలోనే టెండర్ నిబంధనలను సవరించి నాణ్యతా ప్రమాణాలను తగ్గించారని సీఎం ఆరోపించారు. 2022లో సీఎఫ్టీఆర్ఐ ల్యాబ్ రిపోర్టులో బీటా సిటోస్టెరాల్ ఉన్నట్టు వెల్లడైనా, ఆ నివేదికను అప్పటి పాలకులు పక్కన పెట్టారని చెప్పారు. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి టెండర్లు దక్కించుకున్నారని, టీటీడీ సాంకేతిక నిపుణులకు ఖరీదైన ఫోన్లు ఇచ్చి అనుమతులు పొందినట్టు సిట్ గుర్తించిందన్నారు. మోనోగ్లిసరైడ్, ఎసిటిక్ యాసిడ్ వంటి రసాయనాలతో కల్తీ నెయ్యి తయారు చేసినట్టు తేలిందన్నారు.

అవినీతి ఆరోపణలు, లంచాల డైరీ స్వాధీనం : అప్పటి టీటీడీ చైర్మన్కు అనుబంధంగా ఉన్న వ్యక్తి రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నట్టు సిట్ విచారణలో బయటపడిందని సీఎం పేర్కొన్నారు. లంచాల వివరాలతో కూడిన డైరీని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కుట్రపూరితంగా ముఠాగా ఏర్పడి ఈ వ్యవహారం నడిపినట్టు దర్యాప్తు తేల్చిందన్నారు.

దేవాలయాలపై దాడుల అంశం : 2019-24 మధ్య 2032 దేవాలయాలపై దాడులు జరిగాయని సీఎం ఆరోపించారు. రామతీర్థం ఘటన, అంతర్వేది రథ



దహనం, ఇతర ఆలయాల్లో జరిగిన చోరీలను ప్రస్తావించారు. "మా హయాంలో దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం," అని స్పష్టం చేశారు.

రాజకీయ పునరావాసంగా టీటీడీ : టీటీడీ పాలక మండలిని రాజకీయ పునరావాస వేదికగా మార్చారని, 85 మంది సభ్యులతో బోర్డు ఏర్పాటు చేసి తర్వాత హైకోర్టు తప్పు పట్టడంతో జీవో వెనక్కు తీసుకున్నారని చెప్పారు. తిరుమలలో ఆచారాలను గౌరవించాల్సిందేనని, శ్రీవారిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వడానికీ నిరాకరించిన ఘటనలను ప్రస్తావించారు.

"భగవంతుడి సేవలో నాణ్యతకు రాజీ లేదు" : "భగవంతుడి కోసం తయారు చేసే ప్రసాదాన్ని అత్యుత్తమ నాణ్యతతోనే చేస్తాం. అలాంటిది కలుషితం చేయడం ఘోర అపచారం," అని సీఎం అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్రలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# హిందూ ధర్మంపై దాడి జరిగితే ముక్తకంఠంతో ఖండించాలి

●లడ్డూ కల్తీ కేసులో దోషులకు శిక్ష తప్పదు ● శ్రీవారి ప్రసాదం అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు ● నెయ్యి కల్తీపై సిట్ దర్యాప్తు...బాధ్యులు తప్పించుకోరని హెచ్చరిక ● అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ నేరానికి పాల్పడిన బాధ్యులకు కూటమి ప్రభుత్వం కచ్చితంగా శిక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం శాసనసభలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై జరిగిన చర్చలో ఉపముఖ్యమంత్రి విస్తృతంగా ప్రసంగించారు. హిందూ ధర్మంపై దాడి జరిగితే భాష, కులం, ప్రాంతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అలా చేయకపోతే ఇలాంటి ఘటనలు పరంపరగా కొనసాగుతాయని హెచ్చరించారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్ర జరిగిందని ఆరోపించారు.

ఎన్డీడీబీ నివేదిక, సిట్ దర్యాప్తు : నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని పేర్కొన్నట్లు తెలిపారు. అదే సమయంలో సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేపట్టిన విచారణలో నెయ్యిలో అసలు నెయ్యే లేదని తేల్చినట్టు వెల్లడించారు. పామాయిల్, ఇతర రసాయనాలు కలిపి నెయ్యి తయారు చేసినట్టు ఆధారాలు లభించాయని చెప్పారు. ఒక్క లీటరు పాలు వినియోగించకుండా నెయ్యి తయారు చేశారని సిట్ ఛార్జిషీట్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కేసులో 36 మందిని నిందితులుగా గుర్తించారని, శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేయడమే లక్ష్యంగా కుట్ర జరిగిందని సిట్ వెల్లడించిందన్నారు.

టెండర్ నిబంధనల్లో మార్పులు : నెయ్యి సరఫరా కాంట్రాక్టులను నచ్చిన సంస్థలకు కట్టబెట్టేందుకు టెండర్ నిబంధనలను సవరించారని ఉపముఖ్యమంత్రి ఆరోపించారు. వార్షిక టర్నోవర్ అర్హతను రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించడం, రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధన తొలగించడం, అనుభవాన్ని మూడు సంవత్సరాల నుంచి ఒక్క సంవత్సరానికి కుదించడం, వెన్న తయారీ సామర్థ్యాన్ని 12 టన్నుల నుంచి 8 టన్నులకు తగ్గించడం వంటి మార్పులు చేశారని తెలిపారు. ఈ సవరణల అనంతరం ఎంపికైన సంస్థలు 2020-2023 మధ్య నెయ్యి సరఫరా చేశాయని, అవసరమైన అర్హతలు లేకపోయినా ఒప్పందాలు ఇచ్చినట్టు సిట్ ఛార్జిషీట్లో పేర్కొన్నట్లు తెలిపారు.

11 కోట్ల భక్తులకు కల్తీ లడ్డూలు : 2019-2024 మధ్య సుమారు 11 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, ఆ కాలంలో 48.76 కోట్ల లడ్డూలు విక్రయించబడినట్టు వివరించారు. అందులో సుమారు 20.10 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయని తెలిపారు. ఆ లడ్డూలలో లక్ష లడ్డూలు అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పంపిణీ చేశారని పేర్కొన్నారు.

బాధ్యులు శిక్షించా ఈ తప్పుకు గతంలో నియమించబడిన టీటీడీ పాలక మండలే జవాబుదారీ అని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "ఈ వ్యవహారంలో గత ప్రభుత్వానికి చెందిన వ్యక్తులపై నేను నేరుగా ఆరోపణ చేయలేదు. కానీ అప్పటి పాలక మండలి చేసిన తప్పుకి వారే బాధ్యత వహించాలి" అని చెప్పారు. కల్తీ జరిగిందని అంగీకరించి చర్యలు తీసుకోవాలనే బదులు, అసలు కల్తీయే జరగలేదని వాదించడం వల్లే ఇంత చర్చకు దారితీసిందన్నారు. ఈ వ్యవహారంలో నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని కోరారు.

ధర్మ పరిరక్షణపై పిలుపు దేవాలయాల పరిరక్షణకు ప్రత్యేక సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు అవసరమని అభిప్రాయపడ్డారు. ఇతర మతాలకు ఇలాంటి ఘటనలు జరిగితే దేశవ్యాప్తంగా తీవ్ర స్పందన వచ్చేదని, హిందూ ధర్మం విషయంలో మాత్రం అలాంటి స్పందన కనిపించడం లేదన్నారు. ఒక్క సంవత్సరానికి కుదించడం, వెన్న తయారీ సామర్థ్యాన్ని 12 టన్నుల నుంచి 8 టన్నులకు తగ్గించడం శ్రీకృష్ణదేవరాయల 'అముక్తమాల్యద'లో పేర్కొన్న శ్లోకాన్ని ఉదహరిస్తూ, దేవాలయాల నిర్వహణలో లోభులు, వసూళ్లకు అలవాటు పడినవారికి అధికారం ఇవ్వకూడదని చెప్పారు. భగవంతుడి ధనాన్ని దుర్వినియోగం చేసే వారి తరాలు నశిస్తాయని హెచ్చరించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారు తప్పకుండా శిక్షను ఎదుర్కొంటారని, భక్తుల విశ్వాసాన్ని కాపాడడం ప్రభుత్వ ధర్మమని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## ఆడపిల్లల జోలికొస్తే అదే చివరి రోజు

● మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట
● డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం
● పోక్సో కేసుల్లో శిక్షలు పెంపు, 9 మందికి మరణదండన
● హోంమంత్రి వంగలపూడి అనిత



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనమండలిలో జరిగిన చర్చలో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ రాష్ట్రంలో నేరాల నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించామని స్పష్టం చేశారు. "ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపాం. మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఈ ఏడాది నాలుగు శాతం తగ్గడం గర్వకారణం," అని హోంమంత్రి పేర్కొన్నారు.

గంజాయి సాగు జీరో ఎన్డీఏ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై ఉక్కుపాదం మోపిందని అనిత తెలిపారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టేందుకు 'ఈగల్' అనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకప్పుడు రాష్ట్రం డ్రగ్స్ హబ్గా మారిందని విమర్శలు వచ్చాయని, ఇప్పుడు గంజాయి నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ను చూసి ఇతర రాష్ట్రాలు నేర్చుకునే పరిస్థితి వచ్చిందన్నారు. స్కూల్ పిల్లల బ్యాగుల్లోకి గంజాయి చేరిన రోజులు పోయాయని, ఇప్పుడు అదే విద్యార్థులు "గంజాయి వద్దు బ్రో- డ్రగ్స్ వద్దు బ్రో" అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులపైనా దృష్టి పెట్టామని, 24 నుంచి 48 గంటల్లో నిందితులను అరెస్ట్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

పోక్సో కేసుల్లో కఠిన శిక్షలు పోక్సో కేసుల్లో శిక్షలు 15 శాతం పెరిగాయని, మొత్తం 506 మందికి శిక్షలు పడగా అందులో 9 మందికి మరణదండన, 169 మందికి జీవిత ఖైదు విధించబడిందని వెల్లడించారు. నేరస్థులకు బెయిల్ రాకముందే శిక్షలు వేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. మదనపల్లి ఘటన బాధాకరమని పేర్కొన్న అనిత, నిందితుడి పై ప్రభుత్వం ఒత్తిడి పెంచడంతోనే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. నేరాలు చేసే వారికి ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. మహిళా రక్షణ, చిన్నారుల భద్రతలో రాజీ పడబోమని, నేరాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

## మంత్రి నారా లోకేష్కు హైకోర్టు ప్రశంసలు

**కస్తూర్బా పాఠశాలల టీచర్ల జీతాల పెంపుపై సానుకూల స్పందన**

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి కస్తూర్బా బాలికా విద్యాలయాల ఉపాధ్యాయుల జీతాల పెంపు అంశంపై మంత్రి నారా లోకేష్ ప్రకటించిన నిర్ణయాన్ని హైకోర్టు ప్రశంసించింది. ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న తీరు అభినందనీయమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కస్తూర్బా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి జీతాలు పెంచుతామని ప్రకటించడం సానుకూల పరిణామమని హైకోర్టు పేర్కొంది. అలాగే హాస్టళ్లలో ఎలుకలు కరిచిన ఘటనపై మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రశంసనీయమని తెలిపింది. అయితే, ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల భద్రత, వసతి సౌకర్యాల విషయంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది.

# పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

ఏపీ స్టేట్ బ్యూరో,అమరావతి రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. దాదాపు 55 అజెండా అంశాలను చర్చించి వాటికి ఆమోదం తెలిపినట్లు సమాచారం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి సృష్టి లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు కేబినెట్ ముద్ర వేసింది. వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం ద్వారా పరిశ్రమల విస్తరణకు మార్గం సుగమమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పర్యాటక రంగాభివృద్ధికి సంబంధించి పలు జిల్లాల్లో ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడతో పాటు రాజమహేంద్రవరం, చీరాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నెల్లూరు జిల్లాలో మహిళల కోసం కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదే విధంగా సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంపు, ఉపాధి అవకాశాల సృష్టి లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల బలోపేతానికి సంబంధించి కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే పలు కీలక అంశాలపై కేబినెట్ తీసుకున్న నిర్ణయాలు త్వరలో అమలులోకి రానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ సేవలను సులభతరం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ఉద్యోగులు, అధికారులు పని చేయాలని ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీఎస్ పనితీరును సీఎం సమీక్షించారు.

# కొత్తగా 10 బీసీ గురుకులాలు

● 6 గురుకులాలు జూ.కాలేజీలుగా అప్గ్రేడ్ ● బీసీ విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది ● రాష్ట్ర బీసీ,చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించనున్నామని, ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ముఖ ఆధారిత హాజరుతో బీసీ హాస్టళ్లలో డైట్ బిల్లు మంజూరులో నకిలీ క్లెయిమ్ లను నియంత్రించామని తెలిపారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చాలా దారుణ పరిస్థితులు నెలకున్నాయని, కనీసం మరమ్మతులైన కుళాయిలను కూడా మార్చలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు డైట్ బకాయిల చెల్లింపుతో పాటు బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టామని వివరించారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగి ప్రశ్నలకు మంత్రి సవిత జవాబిచ్చారు. 891 బీసీ వసతి గృహాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు రూ.20 కోట్లతో యూపీఎస్ లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 814 హాస్టళ్లలో రూ.16.85 కోట్లతో ఈ ఏడాది మే నాటికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు పూర్తి చేస్తామని తెలిపారు. జల మిత్ర యాప్ ద్వారా ప్రతి 15 రోజులకొకసారి హాస్టళ్లలో నీటి నమూనాలను పరీక్షించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పౌర సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగా 397 బీసీ హాస్టళ్లలో చిన్న చిన్న మరమ్మతులు చేశామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.14.56 కోట్లతో బీసీ హాస్టళ్లలో 971 మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని, ఈ ఏడాది జూన్ నాటికి వాటిని నిర్మాణాలు పూర్తి చేస్తామని సభకు వెల్లడించారు. హాస్టళ్లలో మెనూ, పరిశుభ్రత, పారిశుధ్యం పర్యవేక్షణకు ఆరోగ్య సేవా మాడ్యూల్ ప్రారంభించామని, హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాలకు వంట పాత్రలు, ఇతర సామాగ్రి సరఫరా చేశామన్నారు.

కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు

బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ గురుకుల పాఠశాలలను ప్రారంభించబోతున్నామన్నారు. ఆరు ఎంజేపీ గురుకుల స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న వినతుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిత్తూరు, శ్రీసత్యసాయి



జిల్లాల్లో చేరో ఎంజేపీ స్కూళ్లను ప్రారంభించిందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులు 10 ఎంజేపీ గురుకుల పాఠశాలల భవనాలను నిర్మించబోతున్నామన్నారు.

కుళాయి మరమ్మతులు కూడా చేయని జగన్

బీసీల విద్యకు అన్న ఎన్టీఆర్ ప్రాధాన్యమిస్తే, అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు 2014-19 మధ్య 65 ఎంజేపీ బీసీ గురుకులాల నిర్మాణానికి అప్పట్లో రూ.1,210 కోట్లు మంజూరు చేశారని మంత్రి సవిత తెలిపారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల గురించి పట్టించుకోలేదన్నారు. చివరికి పులివెందులలో బీసీ బాలిక గురుకుల పాఠశాల నిర్మాణాన్ని కూడా గాలి కొదిలేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతో పులివెందుల ఎంజేపీ బాలిక గురుకుల పాఠశాల నిర్మాణం ఊపందుకుందన్నారు. రాబోయే జూన్ లో సీఎం చంద్రబాబుతో పులివెందుల ఎంజేపీ బాలిక గురుకుల పాఠశాలను ప్రారంభించబోతున్నామని మంత్రి సవిత తెలిపారు. 5 ఏళ్ల వైసీపీ ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లలో చాలా దారుణ పరిస్థితులు నెలకున్నాయని, కనీసం పాడైపోయిన కుళాయిలకు కూడా మరమ్మతులు చేయలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీ హాస్టళ్లలో మరమ్మతులు చేయించిందన్నారు. రూ. 60 కోట్ల సీఎస్ఆర్, డీఎంఎఫ్ నిధులతో మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల డైట్ బకాయిలు చెల్లించామని మంత్రి సవిత గుర్తు చేశారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో సన్నబియ్యంతో భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నామని, ఇది బీసీలు, బీసీ విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని మంత్రి సవిత వెల్లడించారు.

## నేడు వెలుగొండకు సీఎం చంద్రబాబు

● టన్నెల్ పనులపై స్వయంగా సమీక్ష
● రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన ● కొత్త జిల్లాలో తొలి పర్యటనకు రాజకీయ ప్రాధాన్యత



సూర్యప్రతినిధి, ఒంగోలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 25 వ తేదీ (నేడు) వెలుగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రాజెక్టు టన్నెల్ పనులను స్వయంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సాగునీటి రంగానికి అత్యంత కీలకంగా భావిస్తున్న ఈ ప్రాజెక్టు పురోగతిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రాజెక్టు పరిధిలో రూ.456 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే నీటి వృథాను తగ్గించి, రైతులకు మరింత స్థిరమైన సాగునీటి సరఫరా అందేలా అవుతుందని అధికారులు చెబుతున్నారు. వెలుగొండ ప్రాజెక్టు రాయలసీమ, ప్రకాశం జిల్లాల రైతులకు జీవనాడిగా భావిస్తున్నారు. టన్నెల్ పనుల వేగవంతంపై ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సీఎం ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి తొలి పర్యటన కావడంతో రాజకీయంగా కూడా ప్రాధాన్యం పొందుతోంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో

## ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ

● ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ధీటుగా భర్తీ
● శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల మంజూరుపై శాసనమండలిలో సభ్యుడు ఏ.శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయడం జరిగింది. మొత్తం 9 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన సిబ్బంది, 5 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయడం జరిగింది. నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో డేటా లేదు. ఏ టీచర్ ఎక్కడ పనిచేస్తున్నారో కూడా సమాచారం లేదు. ఈ సమాచారాన్ని సేకరించడానికి నాకు 20 నెలల సమయం పట్టింది. గతంలో నేను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేది. వైసీపీ హయాంలో విద్యాశాఖను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాల మంజూరు చేసినా, జూనియర్ కాలేజీ మంజూరు చేసినా ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ తో ముందుకు వెళ్తున్నాం. ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు అవసరమైన అధ్యాపకులను నియమించాల్సిన అవసరం ఉంది. ల్యాబ్ లు కూడా ఏర్పాటుచేస్తాం. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందజేయాల్సిన అవసరం ఉంది. ఇంటర్ విద్యలో మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాం. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

## ప్రభుత్వ కళాశాలలు బలోపేతం

**శాసనమండలిలో మంత్రి నారా లోకేష్**



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీఈడీ కళాశాలలను బలోపేతం చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో అధ్యాపకుల కొరత, ఖాళీలను భర్తీ చేసేందుకు తీసుకున్న చర్యలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల వివరాలు, ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో అవకతవకలు నివారించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పోటీతత్వ ఆధారిత విద్యకు అనుగుణంగా శిక్షణ విధానాలు, పాఠ్యాంశాల సవరణ గురించి శాసనమండలిలో సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కావలి గ్రీష్మ, బి.తిరుమలనాయుడు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డైట్(జిల్లా విద్య, శిక్షణ సంస్థ) కళాశాలల్లో ఉన్న ఖాళీలను డిప్యూటేషన్ విధానంలో భర్తీ చేశాం. కరిక్యులమ్ అప్ డేట్ విషయంలో కన్సల్టేషన్స్ అన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో నిర్వహించాం. ఈ నెల 26, 27 తేదీల్లో సెకెండ్ రౌండ్ కన్సల్టేషన్ జరుగుతుంది. అనంతరం నూతన కరిక్యులమ్ రివైజ్ చేసి అమలుచేస్తాం. ప్రధానంగా కాంపిటెన్స్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎఫ్ఎల్ఎన్ ప్రయారిటీ, టెక్నాలజీ ఇంటిగ్రేషన్, ఇండియన్ ఈథోస్ ఇంటిగ్రేషన్ కీలకమైనవని మేం భావిస్తున్నాం. ఇవి మొత్తం ఇంటిగ్రేట్ చేసి అమలుచేస్తాం.

ప్రైవేటు బీఈడీ కళాశాలల విషయంలో.. ఇప్పటికే ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ను అమలుచేశాం. ఇంజనీరింగ్ లో కూడా అమలుచేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ అమలుచేస్తున్నప్పుడు అటెండెన్స్ కూడా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉంది. కాబట్టి ఇంజనీరింగ్ లో కూడా ఎఫ్ఆర్ఎస్ ను అమలుచేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లు మెథడాలజీ, పెడలాజీని కూడా ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒకవైపు మనం ఎస్ సీఈఆర్టీని బలోపేతం చేస్తున్నాం, పాఠశాల విద్యలో కరిక్యులమ్ ప్రతి సైకిల్ లో అప్ డేట్ చేస్తున్నాం. ఇందులో భాగంగా ఇక్కడ కూడా చేయాల్సిన అవసరం ఉంది. డైట్స్ లో కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. తప్పనిసరిగా చేస్తాం. ట్రైనింగ్ సెంటర్స్ లో మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు ఆదేశాలు జారీ చేశాను.

ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీ ఈడీ కళాశాలల్లో 2019 నుంచి 2024 వరకు రిక్రూట్ మెంట్ జరగలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 16వేల మంది ఉపాధ్యాయులను నియమించాం. ప్రతిఏడాది రిటైర్ మెంట్స్ చూసుకుని ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించాం. నైతిక విలువలపై సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావు గారిని నియమించుకున్నాం. ప్రతివారం నైతిక విలువలపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. దీనిని ప్రతి పాఠశాలకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ట్రస్ట్ ద్వారా రాగిజావ అందజేస్తున్నాం. అగ్రిమెంట్ కూడా పునరుద్ధరిస్తున్నాం. శ్రీ సత్యసాయి పవచనాలను కూడా పాఠ్యంశాల్లో చేర్చి నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉంది. మారుతున్న కాలంలో మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరం. ఏఐ ద్వారా మానసిక సమస్యలను ముందుగానే గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర విభజన వల్ల ఎంత నష్టపోయామనేందుకు డైట్ కళాశాలలే నిదర్శనం. ఎస్ సీఈఆర్టీ విభజన వల్ల మన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తెలంగాణలో ఉండిపోయాయి. పదేళ్ల తర్వాత ఎస్ సీఈఆర్టీని బలోపేతం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 3 డైట్ కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా తీర్చిదిద్దుతాం. మిగతా డైట్ కళాశాలల్లో మౌలిక సౌకర్యాలను మెరుగుపరుస్తామని తెలిపారు.

సూర్య 19 వ వసంతంలోకి ...
www.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


visit us @ https://www.suryaepaper.com
బుధవారం | 25 ఫిబ్రవరి 2026 | విజయవాడ
సంపుటి 19 | సంచిక 127
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం శుక్ల పక్షం, నవమి రా.2.57, రోహిణి మ.2.09, వర్జ్యం ఉ.6.44 నుంచి 8.13 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.51 నుంచి 12.37 వరకు

## కల్తీ నెయ్యి దోషులు
# తప్పించుకోలేరు



- తిరుమల కల్తీ నెయ్యి కుట్రను సభలో బట్టబయలు చేసిన సీఎం
- 59.71 లక్షల లీటర్ల సరఫరా, 20 కోట్లకుపైగా లడ్డూల తయారీ
- టెండర్ నిబంధనల మార్పులు, ల్యాబ్ రిపోర్టుల తొక్కిపెట్టింపుతో శ్రీవారికి ఘోర అపచారం
- దర్యాప్తులో లంచాల డైరీ, రసాయనాల వినియోగం వెలుగులోకి
- తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కుట్రపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వివరాలు-2లో


6 లో

## బాలికలకు ఉచితంగా
# హెచ్‌పీవీ టీకా

- సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ
- ప్రపంచ మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్
- 'సేవా సంకల్ప్'తో లక్ష్యం చేరుకునే నిర్ణయం
- కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్ భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్' రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

## నష్టాల్లో స్టాక్
# మార్కెట్లు


5 లో

- అమెరికా వాణిజ్య విధానాలపై ఆందోళనలతో అమ్మకాల ఒత్తిడి
- 1068 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 288 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ

## కామన్వెల్త్‌లో గడ్కరీ ఏం
# చేశారో తెలియదా?



- బీజేపీ అద్దంలో తన ముఖం చూసుకోవాలని హితవు
- కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ భాను అరెస్ట్‌పై స్పందించిన మల్లిఖార్జన్ ఖర్గే

వివరాలు-6లో

# కొత్త పార్టీపై శశికళ పరోక్ష సంకేతాలు

- తమిళనాడు మాజీ సీఎం జయలలిత 78వ జయంతి వేడుకలు
- తన స్నేహితురాలు జయలలితకు నివాళులు
- అపారమైన ధైర్యం, దృఢ సంకల్పం ఆమె జీవిత ప్రయాణం

6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# లోకేష్ భేష్

- మంత్రి నారా లోకేష్‌కు హైకోర్టు ప్రశంసలు
- కస్తూర్బా పాఠశాలల టీచర్ల జీతాల పెంపుపై సానుకూల స్పందన


2 లో

కస్తూర్బా బాలికా విద్యాలయాల ఉపాధ్యాయుల జీతాల పెంపు అంశంపై మంత్రి నారా లోకేష్ ప్రకటించిన నిర్ణయాన్ని హైకోర్టు ప్రశంసించింది. ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న తీరు అభినందనీయమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.కస్తూర్బా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి జీతాలు పెంచుతామని ప్రకటించడం సానుకూల పరిణామమని హైకోర్టు పేర్కొంది.

## హిందూ ధర్మంపై దాడి జరిగితే
# ముక్తకంఠంతో ఖండించాలి

- లడ్డూ కల్తీ కేసులో దోషులకు శిక్ష తప్పదు
- శ్రీవారి ప్రసాదం అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు
- నెయ్యి కల్తీపై సిట్ దర్యాప్తు...బాధ్యులు తప్పించుకోలేరని హెచ్చరిక
- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ నేరానికి పాల్పడిన బాధ్యులకు కూటమి ప్రభుత్వం కచ్చితంగా శిక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం శాసనసభలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై జరిగిన చర్చలో ఉపముఖ్యమంత్రి విస్తృతంగా ప్రసంగించారు.


2 లో

## కొత్తగా 10 బీసీ
# గురుకులాలు


2 లో

- 6 గురుకులాలు జూ.కాలేజీలుగా అప్గ్రేడ్
- బీసీ విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- రాష్ట్ర బీసీ,చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత

రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించనున్నామని, ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.

## అంతా ఇంతే!




రాజకీయ క్రీడలు ఆడేవారు కూడా పాల్గొనొచ్చా సార్ !

## రైతుల ప్రయోజనాలకు
# వ్యతిరేకంగా ట్రేడ్ డీల్



- యుద్ధ నిర్ణయం రాజకీయమే కానీ సైనికులది కాదు
- పార్లమెంట్‌ను పక్కన పెట్టి ట్రంప్‌తో మోదీ డీల్ చేశారంటూ విమర్శ
- లోక్‌సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ గాంధీ ఆవేదన

వివరాలు-6లో

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో
# ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ

- ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు
- శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్

అమరావతి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.


2 లో

# ఆడపిల్లల జోలికొస్తే అదే చివరి రోజు


2 లో

- మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట
- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం
- పోక్సో కేసుల్లో శిక్షలు పెంపు, 9 మందికి మరణదండన
- హోంమంత్రి వంగలపూడి అనిత

మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనమండలిలో జరిగిన చర్చలో వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ రాష్ట్రంలో నేరాల నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించామని స్పష్టం చేశారు.

## పేరు మార్చుకున్న
# దేవ భూమి

### కేరళ పేరు.. ఇక కేరళం



6 లో

- ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్
- ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు
- విజయన్ ప్రభుత్వానికి భాజపా మద్దతు
- తాజా అధికారిక చర్యలతో సాకారమైన కల

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## అజేయ భారతానికి 'ప్రహార్'

భారతదేశ అంతర్గత భద్రతా వ్యవస్థలో సరికొత్త శకాన్ని ఆరంభిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రహార్ పేరుతో మొట్టమొదటి జాతీయ ఉగ్రవాద వ్యతిరేక విధానాన్ని ప్రకటించింది. దేశ సార్వభౌమత్వానికి సవాలు విసురుతున్న సరిహద్దు ఉగ్రవాదం, సైబర్ చొరబాట్లు, డ్రోన్ల దుర్వినియోగం వంటి ఆధునిక ముప్పులను ఎదుర్కోవడానికి ఇది ఒక సమగ్ర కార్యాచరణగా నిలుస్తుంది. కేవలం రక్షణను మాత్రమే పరిమితం కాకుండా, ఉగ్రవాదానికి దాని మూలాల్లోనే తుడిచిపెట్టేలా జీరో టాలరెన్స్ విధానాన్ని ప్రభుత్వం ఈ వ్యూహం ద్వారా స్పష్టం చేసింది. నిఘా ఆధారిత నిరోధక చర్యలు చేపట్టడం, ఉగ్రవాదులకు అందే నిధులు, ఆయుధాలు, ఆశ్రయాలను పూర్తిగా అడ్డుకోవడం ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రహార్ వ్యూహం ఏడు కీలక స్తంభాలపై ఆధారపడి రూపొందించబడింది. నిరోధక చర్యలు, తక్షణ స్పందన, అంతర్గత సామర్థ్యాలను పెంపొందించడం, మానవ హక్కులు మరియు చట్టబద్ధమైన పాలన, ఉగ్రవాదానికి దారితీసే పరిస్థితులను తగ్గించడం, అంతర్జాతీయ సహకారాన్ని కూడగట్టడం మరియు సామాజిక పునరుద్ధరణ వంటి అంశాలు ఇందులో ప్రధానమైనవి. పొరుగు దేశాలు ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా వాడుకుంటున్న తరుణంలో, భారత్ ఎటువంటి మతానికి లేదా జాతికి ఉగ్రవాదాన్ని ఆపాదించకుండా, మానవత్వానికి వ్యతిరేకమైన ఈ చర్యను అంతర్జాతీయ స్థాయిలో ఎండగడుతోంది. ఆధునిక సాంకేతికతను వాడుకుని ముసుగులో కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద గ్రూపుల నెట్‌వర్క్‌లను ఛేదించడంపై ఈ విధానం ప్రత్యేక దృష్టి సారించింది.
సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఉగ్రవాదులు ఎన్‌క్రిప్షన్, డార్క్ వెబ్, క్రిప్టో వాలెట్ల ద్వారా తమ ఉనికిని దాచుకుంటున్నారు. రసాయన, జీవ, రేడియోధార్మిక మరియు అణు పదార్థాలను ఉగ్రవాదుల చేతికి చిక్కకుండా చూడటం భద్రతా సంస్థలకు పెద్ద సవాలుగా మారింది. దీనిని ఎదుర్కోవడానికి మల్టీ-ఏజెన్సీ సెంటర్ మరియు ఇంటెలిజెన్స్ బ్యూరో పరిధిలోని జాయింట్ టాస్క్ ఫోర్స్ వంటి సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచి, నిజసమయ సమాచారాన్ని పంచుకునేలా వ్యవస్థను బలోపేతం చేశారు. కేవలం పోలీసు చర్యలకే పరిమితం కాకుండా, గ్యాంగ్‌స్టర్లు మరియు ఉగ్రవాదుల మధ్య ఏర్పడుతున్న బంధాన్ని తెంచివేయడం ద్వారా నేరపూరిత వ్యవస్థల నడ్డి విరుస్తున్నారు.
ఈ విధానంలో సామాజిక బాధ్యతకు కూడా పెద్దపీట వేశారు. యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులు కాకుండా నిరోధించడం, పేదరికం, నిరుద్యోగం వంటి కారణాలను ఉగ్రవాద సంస్థలు వాడుకోకుండా చూడటం ఇందులో ముఖ్యం. సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతూనే, మరోవైపు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉపా () వంటి కఠిన చట్టాల ద్వారా ఉక్కుపాదం మోపుతున్నారు. దేశ భద్రతను కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడకుండా, ఒక బహుముఖ జాతీయ భద్రతా సవాలుగా పరిగణిస్తూ ప్రహార్ వ్యూహం ఒక రక్షణ కవచంలా దేశాన్ని కాపాడుతోంది.
భారతదేశం ఎదుర్కొంటున్న ఉగ్రవాద సవాళ్లు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా గాలి, నీరు, భూమి మరియు అంతరిక్షం వంటి అన్ని రంగాల్లో విస్తరించి ఉన్నాయని ప్రహార్ విధానం నొక్కి చెబుతోంది. ముఖ్యంగా డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా, మాదకద్రవ్యాల రవాణా వంటి సరికొత్త ముప్పులను ఎదుర్కోవడానికి అత్యాధునిక సాంకేతికతను మరియు కృత్రిమ మేధస్సును రక్షణ వ్యవస్థలో భాగం చేశారు. గతంలో జరిగిన ఉగ్రదాడుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో అటువంటి పొరపాట్లు జరగకుండా కేంద్ర, రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారుల మధ్య సమన్వయాన్ని పెంచడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ వంటి ఉన్నత స్థాయి దళాలు తక్షణమే రంగంలోకి దిగేలా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఉగ్రవాద నిర్మూలనలో కేవలం బలగాల ప్రయోగమే కాకుండా చట్టపరమైన పటిష్టత కూడా అత్యంత కీలకమని ఈ వ్యూహం స్పష్టం చేస్తోంది. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత వంటి నూతన చట్టాల ద్వారా ఉగ్రవాదులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో మానవ హక్కులకు భంగం కలగకుండా న్యాయపరమైన పర్యవేక్షణలో ఈ కార్యకలాపాలు సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే నెట్‌వర్క్‌లను ఛేదించడం, వారి ఆర్థిక వనరులను స్తంభింపజేయడం ద్వారా ముష్కరులు దేశంలో అడుగుపెట్టే అవకాశమే లేకుండా చేయడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యం.
సామాజిక చైతన్యం ద్వారా ఉగ్రవాదాన్ని అడ్డుకోవడం ప్రహార్ విధానంలోని ఒక విశిష్టమైన అంశం. జైళ్లలో లేదా ఆన్‌లైన్ మాధ్యమాల్లో యువత తీవ్రవాదం వైపు మళ్లకుండా మత పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు మరియు సమాజంలోని ప్రముఖులను ఈ పోరాటంలో భాగస్వాములను చేస్తున్నారు. పేదరికం, నిరుద్యోగం వంటి సామాజిక సమస్యలను అడ్డుపెట్టుకుని ఉగ్రవాద సంస్థలు చేసే కుట్రలను తిప్పికొట్టడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఒక ఆయుధంగా వాడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఉగ్రవాదానికి వ్యతిరేకమైన ఒప్పందాలు, నిఘా సమాచార మార్పిడి ద్వారా ప్రపంచ దేశాల మద్దతును భారత్ కూడగడుతోంది. ఈ విధంగా ప్రహార్ విధానం భారతదేశాన్ని ఒక సురక్షితమైన మరియు ఉగ్రవాద రహిత దేశంగా మార్చడానికి ఒక బలమైన పునాదిని వేసింది.
ప్రహార్ విధానం కేవలం ప్రస్తుత ముప్పులను ఎదుర్కోవడమే కాకుండా భవిష్యత్తులో రాబోయే పెను సవాళ్లను ముందే ఊహించి సిద్ధమవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా రసాయన, జీవ, రేడియోధార్మిక మరియు అణు పదార్థాలను ఉగ్రవాదులు ఆయుధాలుగా మలచుకోకుండా నిరోధించడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. ఇలాంటి ప్రమాదకర పదార్థాల రవాణాపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు డిజిటల్ రంగంలో ఉగ్రవాదులు సృష్టించే మారణాయుధాల ముప్పును అడ్డుకోవడానికి ప్రత్యేక సైబర్ విభాగాలు పనిచేస్తున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని సరికొత్త రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉగ్రవాదుల కంటే ఒకడుగు ముందే ఉండాలనేది ప్రభుత్వ వ్యూహం.
అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాద నిర్మూలన కోసం భారత్ చేస్తున్న పోరాటంలో ప్రహార్ విధానం ఒక మైలురాయిగా నిలుస్తుంది. వివిధ దేశాలతో కుదుర్చుకున్న నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు, పరస్పర చట్టపరమైన సహాయ ఒప్పందాల ద్వారా విదేశాల్లో తలదాచుకున్న ఉగ్రవాదులను పట్టుకోవడం సులభతరమైంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బలమైన గళాన్ని వినిపిస్తూ ఉగ్రవాద ముఠాలకు ఏ దేశం కూడా ఆశ్రయం ఇవ్వకుండా భారత్ ఒత్తిడి తెస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గూఢచారి సంస్థలతో సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సరిహద్దులు దాటి వచ్చే ముప్పులను ప్రాథమిక దశలోనే తుంచివేసేలా ఈ విధానం రూపొందించబడింది.
మొత్తం మీద చూస్తే, ప్రహార్ అనేది కేవలం ఒక పత్రం మాత్రమే కాదు, ఇది భారతదేశ భద్రతా దళాల ఆత్మవిశ్వాసానికి మరియు పాలకుల అంకితభావానికి ప్రతిరూపం. శాంతి స్థాపన కోసం భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నప్పటికీ తన దేశ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే శక్తులపై కనికరం లేని యుద్ధం ప్రకటించింది. సమాజంలోని అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ఉగ్రవాదంపై సాగిస్తున్న ఈ పోరాటం రాబోయే తరాలకు సురక్షితమైన మరియు సుస్థిరమైన భారతదేశాన్ని అందిస్తుందని ఈ విధానం హామీ ఇస్తోంది. సాంకేతికత, చట్టబద్ధత మరియు సామాజిక చైతన్యం కలగలిసిన ఈ ప్రహార్ వ్యూహం ఉగ్రవాద రహిత భారతావని నిర్మాణంలో వెన్నెముకగా నిలుస్తుంది.

# ఖనిజాల కారిడార్..భారత రక్షణ కవచం

- ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యం
- ఏపీ, తమిళనాడు, ఒడిశా, కేరళ లను కలుపుతూ ప్రత్యేకమైన కారిడార్
- వ్యూహాత్మక కారిడార్ ఏర్పాటు తో అనేక ఆర్థిక ప్రయోజనాలు
- మిళితమై ఉన్న జాతీయ భద్రతా పరమైన అంశాలు
- అస్థిరమైన అంతర్జాతీయ మార్కెట్ ధరలు నిలువరించే యత్నాలు



తేజస్విని
హైదరాబాద్

భారతదేశ పారిశ్రామిక భవిష్యత్తును మార్చగలిగే శక్తి ఉన్న అరుదైన ఖనిజాల నిక్షేపాలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాలను కలుపుతూ ప్రత్యేకమైన కారిడార్‌ను ప్రకటించింది. ఆధునిక సాంకేతికత, రక్షణ రంగం, పునరుత్పాదక ఇంధన వనరుల తయారీలో ఈ ఖనిజాలు అత్యంత కీలకం కానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చైనా గుత్తాధిపత్యాన్ని తట్టుకుని, స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా భారత్ ఈ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ కారిడార్ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి అందడమే కాకుండా, వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ వ్యూహాత్మక కారిడార్ ఏర్పాటు వెనుక కేవలం ఆర్థిక ప్రయోజనాలే కాకుండా, జాతీయ భద్రతా పరమైన అంశాలు కూడా మిళితమై ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, క్షిపణి వ్యవస్థల తయారీకి అవసరమైన ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశ్యం. సముద్ర తీర ప్రాంతాల్లో లభించే మోనజైట్ వంటి ఖనిజాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా భారత్ గ్లోబల్ సప్లై చైన్‌లో కీలక భాగస్వామిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ యొక్క ప్రాధాన్యతను అర్థం చేసుకోవడం చాలా అవసరం.

**ఈ నాలుగు రాష్ట్రాల ఎంపికకు గల కారణాలు**

**తీర ప్రాంత భౌగోళికాంశాలు:**

భారతదేశంలోని తూర్పు మరియు పశ్చిమ తీర ప్రాంతాల్లో అరుదైన ఖనిజ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాల్లోని ఇసుక దిబ్బల్లో అత్యంత విలువైన ఖనిజాలు ఉన్నట్లు భూగర్భ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోని సముద్రతీర ఇసుకలో మోనజైట్, గార్నెట్, ఇల్మేనైట్ వంటి మూలకాలు సమృద్ధిగా లభిస్తాయి, ఇవి అరుదైన భూమి మూలకాల తయారీకి ప్రాథమిక వనరులు.
కేరళ, తమిళనాడు తీరాల్లో కూడా దశాబ్దాలుగా ఖనిజాల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ, ఇప్పుడు వాటిని ఒక వ్యవస్థీకృత కారిడార్‌గా మార్చడం వల్ల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఉన్న పోర్టులు, రవాణా సౌకర్యాలు ముడి పదార్థాలను శుద్ధి కేంద్రాలకు తరలించడానికి, ఎగుమతి చేయడానికి ఎంతో అనుకూలంగా ఉన్నాయి. అందుకే ప్రభుత్వం ఈ నాలుగు రాష్ట్రాలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసింది.

**నిల్వల లభ్యత – నాణ్యత:**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుండి ఒడిశాలోని గంజాం వరకు విస్తరించి ఉన్న తీర రేఖలో అత్యున్నత నాణ్యత కలిగిన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ఇక్కడి ఇసుకలో ఉండే మూలకాలు అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధరను కలిగి ఉంటాయి. కేరళలోని చవర వంటి ప్రాంతాల్లో లభించే నిక్షేపాలు అత్యంత స్వచ్ఛమైనవిగా గుర్తించబడ్డాయి, ఇవి సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తాయి. తమిళనాడులో ఉన్న రిఫైనరీ సామర్థ్యం ఈ కారిడార్‌కు అదనపు బలం చేకూరుస్తుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నందున, కొత్త మౌలిక సదుపాయాల కల్పన సులభం అవుతుంది. నిల్వలు ఎక్కడైతే ఎక్కువగా ఉండి, వెలికితీతకు ఖర్చు తక్కువగా ఉంటుందో ఆ ప్రాంతాలకే ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది.

**ప్రాజెక్ట్ అమలులో ఎదురయ్యే ఇబ్బందులు**

**పర్యావరణ – సామాజిక సవాళ్లు :**

తీర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. సముద్ర కోత, తీర ప్రాంత జీవవైవిధ్యం దెబ్బతినడం వంటి అంశాలపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకారులకు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నందున, వారిని ఒప్పించడం, సరైన పునరావాసం కల్పించడం ప్రభుత్వానికి ఒక సవాలుగా మారుతుంది. అంతేకాకుండా, అరుదైన ఖనిజాల శుద్ధి ప్రక్రియలో రేడియోధార్మిక వ్యర్థాలు వెలువడే అవకాశం ఉంది. వీటిని సురక్షితంగా నిర్వహించడం మరియు పారబోయడం అత్యంత కష్టతరమైన ప్రక్రియ. పర్యావరణ అనుమతులు పొందడం, స్థానిక నిరసనలను ఎదుర్కోవడం ఈ ప్రాజెక్ట్ వేగాన్ని తగ్గించే ప్రధాన కారణాలు కావచ్చు.

**సాంకేతిక పరిజ్ఞానం కొరత:**

అరుదైన ఖనిజాలను వేరు చేయడం, వాటిని శుద్ధి చేసి వినియోగానికి సిద్ధం చేయడం అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక ప్రక్రియ. ప్రస్తుతం ఈ సాంకేతికతలో చైనా అగ్రస్థానంలో ఉంది. భారత్‌లో తవ్వకాలు జరిపే సామర్థ్యం ఉన్నప్పటికీ, అత్యున్నత స్థాయి శుద్ధి చేసే సాంకేతికత ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. విదేశీ సంస్థల సహకారం లేకుండా ఈ ప్రక్రియను విజయవంతం చేయడం సాధ్యం కాదు. ఖనిజాలను వెలికితీసే క్రమంలో భూగర్భ జలాల కాలుష్యం జరగకుండా చూడటం, రసాయన ప్రక్రియలను నియంత్రించడం వంటి సాంకేతిక సవాళ్లు ఎదురవుతాయి. స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడానికి లేదా ఇతర దేశాల నుండి సాంకేతిక బదిలీని వేగవంతం చేయడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

**పాలనాపరమైన –చట్టపరమైన చిక్కులు:**

భారతదేశంలో మైనింగ్ రంగానికి సంబంధించి అనేక కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయి. అరుదైన ఖనిజాలు వ్యూహాత్మకమైనవి కావడం వల్ల, వీటిపై కేంద్ర ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది, కానీ భూమి మరియు మైనింగ్ అనుమతులు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తాయి. ఈ రెండు వ్యవస్థల మధ్య సమన్వయం కుదరడం, వివిధ రకాల అనుమతులు (క్లియరెన్స్‌లు) సకాలంలో రాకపోవడం ప్రాజెక్ట్ జాప్యానికి ప్రధాన కారణం అవుతుంది.
ముఖ్యంగా తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలు ఈ ప్రాజెక్టుకు పెద్ద అడ్డంకిగా మారవచ్చు. సముద్ర తీరానికి సమీపంలో మైనింగ్ చేపట్టడం వల్ల పర్యావరణ చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడటం మరియు న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవడం అధికారులకు కత్తిమీద సాము వంటిదే. ఈ చట్టపరమైన సంక్లిష్టతల వల్ల పెట్టుబడిదారులు వెనకడుగు వేసే అవకాశం కూడా ఉంది.

**అస్థిరమైన అంతర్జాతీయ మార్కెట్ ధరలు:**

అరుదైన ఖనిజాల మార్కెట్ ప్రస్తుతం చైనా గుత్తాధిపత్యంలో ఉంది. చైనా కావాలనే ధరలను తగ్గించడం లేదా పెంచడం ద్వారా ఇతర దేశాల ఉత్పత్తిదారులను దెబ్బతీసే అవకాశం ఉంది. భారతదేశం భారీ పెట్టుబడులతో ఉత్పత్తిని ప్రారంభించిన సమయంలో, అంతర్జాతీయంగా ధరలు తగ్గితే ఆ ప్రాజెక్ట్ ఆర్థికంగా భారంగా మారుతుంది. ఇది ప్రభుత్వానికి ,ప్రైవేట్ భాగస్వాములకు భారీ నష్టాన్ని కలిగించవచ్చు.
అంతేకాకుండా, ఈ ఖనిజాలకు గ్లోబల్ సప్లై చైన్‌లో ఉన్న డిమాండ్ ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. కొత్త రకమైన సాంకేతికతలు అందుబాటులోకి వచ్చి, ఈ ఖనిజాలకు ప్రత్యామ్నాయాలు కనుగొంటే, మనం చేపట్టిన ఈ భారీ కారిడార్ విలువ తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడటం ఒక పెద్ద సవాలు.

**మౌలిక సదుపాయాల కొరత, రవాణా ఇబ్బందులు :**

ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లోని తీర ప్రాంతాలు తరచుగా తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలకు గురవుతుంటాయి. అటువంటి ప్రాంతాల్లో భారీ శుద్ధి కర్మాగారాలను నిర్మించడం మరియు వాటిని ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడటం ఖర్చుతో కూడుకున్న పని. తీర ప్రాంతాల నుండి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలకు ఈ ఖనిజాలను సురక్షితంగా రవాణా చేయడానికి అవసరమైన ప్రత్యేక రైల్వే లైన్లు లేదా రోడ్డు మార్గాల కొరత కూడా ఉంది.
ఈ ఖనిజాల శుద్ధికి విపరీతమైన విద్యుత్ మరియు నీటి అవసరాలు ఉంటాయి. కేరళ మరియు తమిళనాడు వంటి రాష్ట్రాల్లో నీటి లభ్యత ఇప్పటికే ఒక సమస్యగా ఉన్న తరుణంలో, భారీ పరిశ్రమలకు నీటిని కేటాయించడం స్థానిక ప్రజల ఆగ్రహానికి కారణం కావచ్చు. విద్యుత్ గ్రిడ్‌లను బలోపేతం చేయడం మరియు నిరంతర సరఫరాను అందించడం కూడా మౌలిక సదుపాయాల పరంగా పెద్ద ఇబ్బందిగా పరిణమిస్తుంది.

**నైపుణ్య మానవ వనరుల కొరత :**

అరుదైన ఖనిజాల వెలికితీత మరియు శుద్ధి ప్రక్రియ సాధారణ మైనింగ్ లాంటిది కాదు. దీనికి అణు భౌతిక శాస్త్రం, కెమికల్ ఇంజనీరింగ్ మరియు మెటలర్జీలో అత్యున్నత నైపుణ్యం కలిగిన నిపుణులు అవసరం. ప్రస్తుతం భారతదేశంలో ఈ నిర్దిష్ట రంగంలో అనుభవం ఉన్న శాస్త్రవేత్తలు మరియు కార్మికుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. విదేశీ నిపుణులపై ఆధారపడటం వల్ల ప్రాజెక్ట్ వ్యయం పెరుగుతుంది. స్థానిక యువతకు ఈ రంగంలో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక విద్యా సంస్థలు లేదా పరిశోధనా కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ, దానిని ఆచరణలో పెట్టే నైపుణ్యం కలిగిన మానవ వనరులు లేకపోతే ప్రాజెక్ట్ లక్ష్యాలు నెరవేరవు. మానవ వనరుల అభివృద్ధికి కూడా భారీగా సమయం మరియు నిధులు కేటాయించాల్సి ఉంటుంది.
సాంకేతిక పరంగా చూస్తే, అరుదైన ఖనిజాలను వేరు చేసి, వాటిని అత్యున్నత స్థాయిలో శుద్ధి చేసే పరిజ్ఞానం ప్రస్తుతం భారతదేశంలో పూర్తి స్థాయిలో అందుబాటులో లేదు. ఈ సంక్లిష్ట ప్రక్రియలో ప్రస్తుతానికి విదేశీ సాంకేతికతపైనే ఆధారపడాల్సి వస్తోంది. స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కావాల్సిన ప్రయోగశాలలు, నిపుణులైన శాస్త్రవేత్తల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఖనిజాలను వెలికితీసే సమయంలో భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడటం, రసాయన వ్యర్థాలను నియంత్రించడం వంటి సాంకేతిక సవాళ్లను అధిగమించడం కష్టతరమైన పని నైపుణ్యంకలిగిన మానవ వనరుల అభివృద్ధికి భారీగా సమయం, నిధులు కేటాయించకపోతే ఈ కారిడార్ ఆశించిన లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదు.
చైనా ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి ప్రధాన కారణం 1980వ దశకంలోనే అప్పటి నాయకుడు డెంగ్ జియావోపింగ్ చేసిన ఒక కీలక ప్రకటన. మధ్యప్రాచ్య దేశాలకు చమురు ఉంటే, చైనాకు అరుదైన ఖనిజాలు ఉన్నాయి అని ఆయన పేర్కొన్నారు. కేవలం ఖనిజాలను భూమి నుండి తీయడమే కాకుండా, వాటిని శుద్ధి చేసే సాంకేతికతపై (మెటలర్జీ) చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా లభించే అరుదైన ఖనిజాలలో దాదాపు 90 శాతం శుద్ధి ప్రక్రియ చైనాలోనే జరుగుతోంది.
చైనా విజయానికి మరో ప్రధాన కారణం పర్యావరణ నిబంధనల విషయంలో అనుసరించిన సడలింపులు. ఈ ఖనిజాల వెలికితీత మరియు శుద్ధి ప్రక్రియలో భారీగా రసాయన వ్యర్థాలు, రేడియోధార్మిక పదార్థాలు వెలువడతాయి. అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ కారణాలతో వెనకడుగు వేసినప్పుడు, చైనా మాత్రం తన పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగింది. ప్రభుత్వం అందించిన భారీ సబ్సిడీలు, పరిశోధనా సంస్థలకు కేటాయించిన నిధులు ఆ దేశాన్ని ఒక తిరుగులేని శక్తిగా మార్చాయి. చైనా తన వద్ద ఉన్న అరుదైన ఖనిజ నిల్వలను ఒక దౌత్య ఆయుధంగా మలచుకున్న తీరును గమనిస్తే, భారత్ కూడా అదే స్థాయి వ్యూహాత్మక చొరవను ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో చైనా తన దేశంలోని పర్యావరణ నిబంధనలను పక్కన పెట్టి మరీ ఉత్పత్తిని పెంచడం ద్వారా ప్రపంచ విపణిని తన గుప్పిట్లోకి తెచ్చుకుంది, కానీ భారత్ ఆ పొర పాట్లను చేయకుండా పర్యావరణ హితమైన మైనింగ్ పద్ధతులతో ముందుకు సాగాలి. దీని కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి తీర ప్రాంత కారిడార్లకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. కేవలం ఖనిజాలను వెలికి తీయడమే కాకుండా, వాటిని అత్యాధునిక శుద్ధి కర్మాగారాల ద్వారా తుది ఉత్పత్తులుగా మార్చి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగినప్పుడే నిజమైన స్వయం సమృద్ధి సాధ్యమవు తుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి భారత్ విదేశీ సంబం ధాలను కూడా సమర్థవంతంగా వాడుకోవాలి. చైనా తన శుద్ధి సాంకేతికతను రహస్యంగా ఉంచుతున్న తరుణంలో, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ వంటి దేశాలతో కూడిన అంతర్జాతీయ కూటముల ద్వారా సాంకేతిక బదిలీని వేగ వంతం చేయాలి. మన దేశంలోని భాభా అణు పరిశోధనా కేంద్రం వంటి ప్రతిష్టాత్మక సంస్థల పర్యవేక్షణలో స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేస్తూ, కేరళ మరియు ఒడిశాలోని పరిశోధనా కేంద్రాలలో తక్కువ వ్యయంతో కూడిన శుద్ధి పద్ధతులపై నిరంతరం ప్రయోగాలు జరగాలి. దీనివల్ల ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా, విదేశీ నిపుణులపై ఆధారపడటం కూడా క్రమంగా తగ్గుతుంది.
సామాజిక బాధ్యతను కూడా ఈ ప్రాజెక్టులో అంతర్భాగం చేయడం అత్యంత కీలకం. తీర ప్రాంత మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడుతూ, వారిని ఈ పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములను చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించవచ్చు. రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణ కోసం అత్యున్నత ప్రమాణాలను పాటించడం ద్వారా అటు పర్యావరణాన్ని, ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. ఇటువంటి పారదర్శకమైన పద్ధతులు పాటించడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తుంది, ఇది భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తుంది. మొత్తం మీద చూస్తే, అరుదైన ఖనిజాల కారిడార్ అనేది కేవలం ఒక మైనింగ్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఇది భారతదేశాన్ని ప్రపంచ పారిశ్రామిక పటంలో అగ్రగామిగా నిలిపే ఒక గొప్ప వ్యూహం. పటిష్టమైన రాజకీయ సంకల్పం, అత్యాధునిక సాంకేతికత మరియు సామాజిక బాధ్యత కలగలిస్తే, చైనా ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ భారత్ ఈ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయం. రాబోయే దశాబ్ద కాలం మన దేశ పారిశ్రామిక చరిత్రలో అత్యంత కీలకమైనది, ఈ సమయంలో చేపట్టే ప్రతీ అడుగు రేపటి సుసంపన్న భారతానికి పునాదిగా మారుతుంది.

# రైతుకు కాంతి వెలుగుగా కృత్రిమ మేధ



ఈ. శ్రీనివాస్ రావు,
9912121319

ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) విప్లవంతో ముందుకు సాగుతోంది. ఈ సాంకేతికత వ్యవసాయ రంగాన్ని కూడా పూర్తిగా మార్చేస్తోంది. రైతు చేతిలోని సాంప్రదాయ సాధనాలు ఇక ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థలకు దారి ఇవ్వబోతున్నాయి. భవిష్యత్ సాగు ఏఐ కేంద్రంగానే సాగనుంది. భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం మూలస్తంభం. కోట్లాది మంది జీవనాధారం ఈ రంగంపైనే ఆధారపడి ఉంది. కానీ వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉత్పాదన ఖర్చులు, దిగుబడుల అనిశ్చితి, మార్కెట్ ధరల ఒడిదుడుకులు... ఇవన్నీ కలిసి రైతును నిరాశా నిర్వేదాల్లోకి నెడుతున్నాయి. ఇలాంటి సవాళ్ల మధ్య కృత్రిమ మేధ రైతుకు కాంతి వెలుగుగా మారుతోంది. సరైన వినియోగం ద్వారా ఈ సాంకేతికత రైతు లాభాలను పండించే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. అంతరిక్ష పరిశోధనలు, సమాచార సాంకేతికతలో ప్రపంచానికి తన ప్రతిభ చాటిన భారత్... వ్యవసాయ రంగంలో మాత్రం ఇంకా పూర్తి ఆధునికీకరణకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు విస్తరించినా, ఏఐ రైతుకు ఎలా ఉపయోగపడుతుందో అనే అవగాహన ఇంకా తక్కువే. అనేక మంది రైతుల నిరక్షరాస్యత, సాంకేతిక శిక్షణ లోపం ఈ మార్పును మందగింపజేస్తున్నాయి. నేల ఆరోగ్యమే వ్యవసాయ విజయానికి కీలకం. నేల తేమ, ఆమ్లత్వం, పోషకాల సమతుల్యత తెలియకుండా పంటలు వేయడం వల్ల పెట్టుబడులు వృథా అవుతున్నాయి. ఏఐ ఆధారిత వ్యవస్థలు నేల వివరాలను విశ్లేషించి, ఏ పంట వేయాలో, ఎరువులు ఎంత మోతాదులో ఇవ్వాలో, నీరు ఎప్పుడు ఎంత ఇవ్వాలో సూచిస్తాయి. ఫలితంగా దిగుబడులు పెరిగి, ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.
వాతావరణ మార్పులు రైతుకు అతి పెద్ద సవాలు. అనూహ్య వర్షాలు, తీవ్ర ఎండలు, వరదలు పంటలను నాశనం చేస్తున్నాయి. ఏఐ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించి ముందస్తు వర్షపాత అంచనాలు ఇస్తుంది. ఉష్ణోగ్రతలు పెరిగితే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో సూచిస్తుంది. విపత్తుల సమయంలో నష్టాన్ని అంచనా వేసి పరిహారం నిర్ణయించడంలో కూడా ఏఐ తోడ్పడుతుంది. ముందస్తు సమాచారం రైతుకు రక్షణ కవచంగా మారుతుంది.
నీటి కొరత రాబోయే రోజుల్లో మరింత తీవ్రమవుతుంది. ఇజ్రాయెల్ వంటి దేశాలు చూపిన అధునాతన నీటి యాజమాన్య మోడల్‌ను భారత్‌లో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్కువ ఖర్చుతో పనిచేసే సెన్సర్లు నేల తేమను కొలిచి అవసరమైనప్పుడే నీరు అందిస్తాయి. డ్రోన్లు (యంత్ర పక్షులు) పంటలను పరిశీలించి, ఒక్క నొక్కుతో మోటార్లు నడిపి నీటి వృథా తగ్గిస్తాయి. ఇది పంట ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. మొక్కల ఆకుల రంగు, పెరుగుదల, పోషకాల లోపం, తెగుళ్లను మానవ కంటికి కనిపించకముందే ఏఐ గుర్తిస్తుంది. చిత్రాలను విశ్లేషించి అవసరమైన మందులను మాత్రమే సూచిస్తుంది. ఫలితంగా రసాయనాల వినియోగం గణనీయంగా తగ్గి, ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణం కూడా రక్షణ పొందుతుంది. రైతు దుకాణదారుల సలహాలపై ఆధారపడే అవసరం తగ్గుతుంది.
పంట పండించడం ఒక దశ మాత్రమే. దాన్ని సరైన ధరకు అమ్మడం మరింత కీలకం. ఏఐ దేశీయ-అంతర్జాతీయ మార్కెట్ ధోరణులను విశ్లేషించి ధరల అంచనాలు ఇస్తుంది. గిరాకీ, సరఫరా మధ్య వ్యత్యాసాలను గమనించి అనుకూల మార్కెట్లను సూచిస్తుంది. మధ్యవర్తుల ఆధిపత్యం తగ్గి, రైతు నిర్ణయాలు సమాచార ఆధారంగా ఉంటాయి.
అమెరికా, జర్మనీ, చైనా వంటి దేశాలు ఏఐను వ్యవసాయంలో విస్తృతంగా వినియోగిస్తున్నాయి. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీల సంయుక్త ప్రయోగం మహారాష్ట్రలోని బారామతిలో చెరకు సాగులో అద్భుత ఫలితాలు సాధించింది. ఇది మన దేశంలో కూడా ఏఐ విజయవంత మవుతుందని నిరూపిస్తోంది. కానీ సాంకేతికతను రైతు గడపకు చేర్చడం మాత్రమే సరిపోదు. దాన్ని సమర్థవంతంగా వినియోగించే సామర్థ్యం కూడా పెంపొందించాలి. గ్రామాల్లో సులభ భాషలో వీడియో పాఠాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించాలి. చిన్న-సన్నకారు రైతులకు ఈ సాంకేతికత అందుబాటులోకి రావాలి.
ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశోధనా సంస్థలు, వ్యవసాయ సంఘాలు కలిసి పనిచేయాలి. 'సుస్థిర సాగు కోసం జాతీయ కార్యక్రమం' (), 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాలు ఇప్పటికే పునాది వేశాయి. ఏఐ వ్యవస్థల భద్రతా ప్రశ్నలను కూడా దృష్టిలో ఉంచుకొని, హ్యాకింగ్ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి. కృత్రిమ మేధను సమర్థంగా వినియోగిస్తే పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగి, ఆదాయం స్థిరపడుతుంది. ప్రకృతి అనిశ్చితులను ఎదుర్కొనే ధైర్యం రైతుకు వస్తుంది. డేటా ఆధారిత నిర్ణయాలతో భారత వ్యవసాయం ఎదిగితేనే దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది పడుతుంది.
ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు... రైతు జీవితాల్లో వసంతం తీసుకొచ్చే విప్లవం. ఆ విప్లవాన్ని సాకారం చేయడం ప్రభుత్వం, సమాజం, సాంకేతిక నిపుణుల కర్తవ్యం. ఏఐతో సమృద్ధమైన భారత వ్యవసాయం... ఇది సాధ్యమే!

# అంకెల అగ్రపథం.. సామాన్యుడి సవాళ్ల రథం!

(దిడ్డి శ్రీకాంత్ – 8686865759)

భారత ఆర్థిక వ్యవస్థ నేడు ఒక అద్భుతమైన సంధి కాలంలో ఉంది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 2026-27 కేంద్ర బడ్జెట్ మరియు అంతకుముందు విడుదలైన ఆర్థిక సర్వే ( 2026) దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించే రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధి రేటును నమోదు చేసిన భారత్, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నాలుగో ఏడాది కూడా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అయితే, ఈ అంకెల గారడీ వెనుక సామాన్యుడి బతుకు చిత్రం ఎలా ఉందన్నదే ఇప్పుడు అసలైన ప్రశ్న. ఆర్థిక సర్వే ప్రకారం భారత్ ప్రస్తుతం గోల్డిలాక్స్ దశలో ఉందిఅంటే అద్భుతమైన వృద్ధి (7.4%) మరియు చారిత్రాత్మక కనిష్ట ద్రవ్యోల్బణం (1.7%) మధ్య సమతూకం నడుస్తోంది. వినడానికి ఇది ఎంతో ఆశాజనకంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన 2024 బేస్ ఇయర్ కలిగిన ద్రవ్యోల్బణ సూచీ ప్రకారం జనవరి 2026లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%గా నమోదైంది. ఆహార వస్తువుల వెయిటేజీని తగ్గించడం వల్ల కాగితంపై ధరలు తగ్గినట్టు కనిపిస్తున్నా, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చుల్లో మాత్రం ఉపశమనం కనిపించడం లేదు. ధరల పెరుగుదలను గణించే పద్ధతి మారినా, సామాన్యుడి జేబుకు తూట్లు పడటం ఆగిందా అన్నది ఆలోచించాల్సిన విషయం.

**బడ్జెట్ ఆశలు.. మౌలిక వసతుల జోరు** ఈ ఏడాది బడ్జెట్ అక్షరాలా 53.47 లక్షల కోట్ల వ్యయంతో భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన ( ) కోసం 12.2 లక్షల కోట్లను కేటాయించడం ద్వారా దేశంలో రోడ్లు, రైల్వేలు, ఓడరేవుల నిర్మాణానికి పెద్దపీట వేశారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లు (ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు వంటివి) ప్రతిపాదించడం సంతోషదాయకం. కానీ, ఇన్ని లక్షల కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు, అది తక్షణమే ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోందా లేదా అన్నది విశ్లేషించాలి. కేపిటల్ ఇంటెన్సివ్ సెక్టార్లలో పెట్టుబడులు పెరగడం వల్ల యంత్రాల వాడకం పెరుగుతుంది కానీ, మనుషుల శ్రమకు తగిన గుర్తింపు, ఉపాధి దొరకడం కష్టతరంగా మారుతోంది.

**నిరుద్యోగ రక్కసి – ఉపాధి లేని వృద్ధి?** భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ జాబ్‌లెస్ గ్రోత్ ( ). ఒకవైపు జీడీపీ పరుగులు పెడుతున్నా, మరోవైపు యువత ఉపాధి కోసం అలమటిస్తోంది. ఐటీ దిగ్గజ సంస్థలైన టాప్-5 కంపెనీలు గడిచిన తొమ్మిది నెలల్లో కేవలం 17 మందిని మాత్రమే నికరంగా ఉద్యోగాల్లోకి తీసుకున్నాయనే గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ () మరియు ఆటోమేషన్ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందనే హెచ్చరికలు సర్వేలోనూ వినిపించాయి. బడ్జెట్‌లో బయోఫార్మా శక్తి, సెమీకండక్టర్ మిషన్ 2.0 వంటి అత్యాధునిక రంగాలకు 40,000 కోట్లకు పైగా కేటాయింపులు చేసినా, అవి అధిక నైపుణ్యం ఉన్న వారికే ఉపయోగపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులకు, సాధారణ గ్రాడ్యుయేట్లకు ఉపాధి కల్పించే మాన్యుఫాక్చరింగ్ రంగంపై ఇంకా పట్టు పెంచుకోవాల్సి ఉంది.

**అంతర్జాతీయ సవాళ్లు.. అంతర్గత బలహీనతలు** గ్లోబల్ మార్కెట్‌లో భారత్ ఎదుర్కొంటున్న టారిఫ్ వార్ తీవ్రమైనది. ముఖ్యంగా అమెరికా విధించిన 50% టారిఫ్లు మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రూపాయి విలువ డాలరుతో పోలిస్తే 90 దాటి బలహీనపడటం, విదేశీ ఇన్వెస్టర్లు () తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ఆర్థిక స్థిరత్వానికి సవాలుగా మారాయి. దేశీయంగా చూస్తే, కార్పొరేట్ సంస్థల పెట్టుబడులు గత 13 ఏళ్లుగా ఒకే స్థాయిలో (12%) ఉండిపోవడం ప్రైవేట్ రంగంలో ఉన్న స్తబ్ధతను సూచిస్తోంది. ప్రభుత్వం ఎంతగా కేపెక్స్ () పెంచుతున్నా, ప్రైవేట్ ఇన్వెస్టర్లు ధైర్యంగా ముందుకు రాకపోవడానికి కారణాలను విశ్లేషించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అంకెలు మనల్ని అగ్రరాజ్యం వైపు చూపిస్తున్నా, సామాన్యుడి కడుపు నిండినప్పుడే ఆ వృద్ధికి సార్థకత. కేవలం స్టాక్ మార్కెట్ సూచీలు పెరగడం వల్లనో, భారీ ప్రాజెక్టులు పట్టాలెక్కడం వల్లనో ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పలేం.




# బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

● సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ... ● ప్రపంచ మూడో ఆర్థికవ్యవస్థగా భారత్

● 'సేవా సంకల్ప్'తో లక్ష్యం చేరుకునే నిర్ణయం ● కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్' రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది.

నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది.ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని భావిస్తున్నారు.



# కొత్త పార్టీపై శశికళ పరోక్ష సంకేతాలు

● తమిళనాడు మాజీ సీఎం జయలలిత 78వ జయంతి వేడుకలు ● తన స్నేహితురాలు జయలలితకు నివాళులు

● అపారమైన ధైర్యం, దృఢ సంకల్పం ఆమె జీవిత ప్రయాణం

న్యూఢిల్లీ : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేళ ఆమె స్నేహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. జయలలిత జయంతి వేడుకలకు ముందు శుభవార్త వస్తుందని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన నేపథ్యంలో శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శశికళ తాజాగా చేసిన వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. జయలలితకు నివాళులర్పించిన అనంతరం శశికళ చేసిన వ్యాఖ్యలు తాను కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నానని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లు అయ్యింది.ఫిబ్రవరి 24 (మంగళవారం) తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి. ఈ క్రమంలో శశికళ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్, జయలలిత స్మారక మందిరాల వద్ద పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ అరంగేట్రం గురించి శశికళ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. "ఈ రోజు అమ్మ (జయలలిత) పుట్టినరోజు సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమంలో శుభవార్త వస్తుంది. " అని వ్యాఖ్యానించారు.

**పార్టీ నుంచి సస్పెండ్**

మాజీ సీఎం జయలలిత 2016 డిసెంబర్‌లో మరణించడంతో, అప్పట్లో ఆమె నెచ్చెలి శశికళ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. అంతలోనే శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లారు. దీంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా, తమిళనాడులో మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల ప్రారంభంలో శశికళ చెన్నైలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశికళ సన్నిహితుడు అరసన్ కీలక వ్యాఖ్యలు చేశారు.తాము చిన్నమ్మతోనే (శశికళ) ఉన్నామని, ఆమెకు అండగా నిలుస్తామని అరసన్ అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో శశికళ ఏ నిర్ణయం తీసుకున్నా తాము అందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి వీకే శశికళ, ఆమె భర్త నటరాజన్‌కు చాలా నమ్మకమైన మద్దతుదారుడినని చెప్పారు. ఎప్పటికీ అలాగే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు శశికళ తన మద్దతుదారులతో సమావేశం అవ్వడం, ఇతర పరిస్థితులను బట్టి ఆమె కొత్త పార్టీ పెట్టనున్నారని వార్తలు వినిపించాయి. అందుకు తగ్గట్లుగానే జయలలిత జయంతి నాడు శశికళ పరోక్ష సంకేతాలు ఇచ్చారు.

**మోదీ, అమిత్ షా నివాళులు**

మరోవైపు, జయలలిత 78వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఆమెకు నివాళులర్పించారు. జయలలిత సేవలను గుర్తు చేసుకున్నారు. తమిళనాడులో సంక్షేమ ఆధారిత పాలన, మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి పాటుపడిన ఆకర్షణీయమైన నాయకురాలు, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేత జయలలిత అని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు."జయలలితను ఆమె జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నాం. ఆకర్షణీయ నాయకురాలిగా, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేతగా ఆమె ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఆమె జీవిత ప్రయాణం అపారమైన ధైర్యం, దృఢ సంకల్పంతో కూడుకున్నది. తమిళనాడు ముఖ్యమంత్రిగా మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధిపై బలమైన సంకల్పంతో సంక్షేమ ఆధారిత పాలనను ఆమె కొనసాగించారు." అని మోదీ పేర్కొన్నారు.

**"పేదల సంక్షేమం, మహిళల హక్కుల కోసం జయలలిత కృషి చేశారు'**

అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ సైతం జయలలితకు నివాళులర్పించారు. ఈ క్రమంలో తమిళనాడులోని పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం జయలలిత చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. "తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రజానాయకురాలు జె. జయలలిత జయంతి సందర్భంగా ఆమెకు నా హృదయపూర్వక నివాళులు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం ఆమె అంకితభావంతో కృషి చేశారు.

తమిళనాడును అభివృద్ధి పథంలో నడిపించారు. ఆమె పరిపాలన ప్రయోజనాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరేలా చూసుకున్నారు. ప్రజా సేవ పట్ల ఆమె నిబద్ధత ఎప్పటికీ అందరికీ ప్రేరణగా ఉంటుంది." అని అమిత్ షా ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# కామన్వెల్త్ క్రీడల్లో గడ్కరీ ఏం చేశారో తెలియదా?

● కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ భాను అరెస్ట్‌పై స్పందించిన మల్లిఖార్జున్ ఖర్గే

● బీజేపీ అద్దంలో తన ముఖం చూసుకోవాలని హితవు



ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో న్యూసెన్స్ సృష్టించిన కేసులో జాతీయ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు మంగళవారం ఉదయం 4:30 గంటలకు అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే స్పందించారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ... "కామన్వెల్త్ క్రీడలు జరుగుతున్నప్పుడు నితిన్ గడ్కరీ, ఇతర బీజేపీ నాయకులు ఏం చేశారో తెలియదా? ఈ వ్యక్తులు ప్రతి కార్యక్రమానికి వెళ్లి అక్కడ గందరగోళం సృష్టించలేదా? ఆ సమయంలో వారికి జాతీయవాదం గురించి తెలియదా? అప్పుడు జాతీయ భావాల గురించి.. దేశాన్ని ఐక్యంగా ఉంచడం గురించి ఆందోళన చెందలేదా? దేశం నలుమూలల నుంచి వచ్చే అనేక మంది అథ్లెట్లకు ఏ సందేశం పంపించారు? ఇతరులకు నీతులు చెప్పే ప్రయత్నం మానేయండి. ఇతరులకు బోధించడం మానేయండి. ముందు మీరు మారండి. అద్దంలో మీ సొంత ముఖాన్ని చూసుకోండి. అప్పుడు మీ చర్యలు ఏమిటో మీకు తెలుస్తాయి. అందరికీ మీ గురించి తెలుసు. మాకు నేర్పించవద్దు." అని బీజేపీ నేతలకు మల్లిఖార్జున్ ఖర్గే హితవు పలికారు. ఈనెల 16 నుంచి 20 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ సమ్మిట్ జరిగింది. దీనికి ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సహా అనేక దేశాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. అయితే యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను ఆధ్వర్యంలో కొందరు యువకులు సమ్మిట్‌లోకి ప్రవేశించి అర్ధనగ్నంగా ప్రదర్శించారు. అమెరికాతో డీల్ రద్దు చేసుకోవాలని నినాదాలు చేశారు. ఈ పరిణామంతో అందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 4:30 గంటలకు ఉదయ్ భానును పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రతా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన జెన్ జెడ్ నుంచి యూత్ కాంగ్రెస్ ప్రేరణ పొందినట్లుగా కోర్టుకు పోలీసులు తెలిపారు.



# ముంబై ఉగ్ర దాడి నిందితుడు తహవ్వూర్ రాణాకు షాక్

● రేపు భారత్‌కు రానున్న కెనడా ప్రధాని మార్క్ కార్నీ

● పౌరసత్వాన్ని రద్దు చేయడానికి కెనడా ప్రభుత్వం చర్యలకు అవకాశం

ముంబై : ముంబై ఉగ్ర దాడి నిందితుడు తహవ్వూర్ రాణాకు కెనడా షాక్ ఇవ్వబోతున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. అతడి పౌరసత్వం రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు వర్గాలు పేర్కొంటున్నాయి.కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఫిబ్రవరి 26న భారత్ పర్యటనకు వస్తున్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి బలపడనున్నాయి. గత ప్రధాని జస్టిన్ ట్రూడో కారణంగా రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. మార్క్ కార్నీ ప్రధాని అయ్యాక తిరిగి సంబంధాలు బలపడ్డాయి. ఇక మార్క్ కార్నీ భారత్ పర్యటనకు రాకముందే 26/11 ముంబై ఉగ్రవాద దాడి సూత్రధారి తహవ్వూర్ హుస్సేన్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేయడానికి కెనడా ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తహవ్వూర్ రాణా (65) పాకిస్థాన్‌లో జన్మించిన వ్యాపారవేత్త. ప్రస్తుతం భారతదేశంలో నిర్బంధంలో ఉన్నాడు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా నిర్వహించిన ముంబై ఉగ్రవాద దాడులతో సంబంధాలు ఉన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. 2008లో జరిగిన ఉగ్ర దాడిలో 160 మందికి పైగా మృతి చెందారు.కెనడియన్ ప్రచురణ గ్లోబల్ న్యూస్ నివేదించిన ప్రకారం... ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (×=జజ) తహవ్వూర్ రాణాకు 2001లో పొందిన కెనడియన్ పౌరసత్వాన్ని రద్దు చేయాలనుకుంటున్నట్లు తెలియజేసింది. 1997లో తహవ్వూర్ రాణా కెనడాకు వలస వెళ్లాడు. అయితే ఉగ్ర ఆరోపణలపై కాకుండా తప్పుడు సమాచారం ఆధారంగా పౌరసత్వం మంజూరు చేయబడిందని ×=జజ తన నోటీసులో పేర్కొంది. 2000 సంవత్సరంలో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు కెనడాలో తన నివాసం గురించి తప్పుడు సమాచారం అందించాడని ఆ శాఖ ఆరోపించింది. దరఖాస్తు చేసుకోవడానికి ముందు నాలుగు సంవత్సరాలు ఒట్టావా, టొరంటోలో నివసించానని.. ఆ కాలంలో ఆరు రోజులు మాత్రమే దేశం నుంచి దూరంగా ఉన్నానని పేర్కొన్నాడు. అయితే రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (=జవీ) దర్యాప్తులో ఆ సమయంలో ఎక్కువ సమయం చికాగోలో గడిపాడని.. అక్కడ అనేక ఆస్తులను కలిగి ఉన్నాడని.. ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ, కిరాణా దుకాణం వంటి వ్యాపారాలను నిర్వహించాడని గ్లోబల్ న్యూస్ నివేదిక తెలిపింది. మొత్తానికి తప్పుడు సమాచారం కారణంగా పౌరసత్వం కలిగి ఉండడంతో రద్దు చేస్తున్నట్లు సమాచారం.ఏప్రిల్ 10న అమెరికా నుంచి రాణాను రప్పించిన తర్వాత జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) అధికారికంగా అరెస్టు చేసింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్ నుంచి ప్రత్యేక విమానంలో అతన్ని న్యూఢిల్లీకి తీసుకొచ్చారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్



● యుద్ధ నిర్ణయం రాజకీయమే కానీ సైనికులది కాదు ● పార్లమెంట్‌ను పక్కన పెట్టి ట్రంప్‌తో మోదీ డీల్ చేశారంటూ విమర్శ ● లోక్‌సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ గాంధీ ఆవేదన

న్యూఢిల్లీ : యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

**ప్రధాని స్పందించలేదు: రాహుల్**

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

**వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!**

ఇక ఇండో-- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

**ఎప్‌స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు**

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

**ప్రజలతో కలిసి పోరాటం**

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# తమిళ ప్రజలపై హామీల వర్షం

● మూడో విడత ఫ్రీ స్కీమ్‌లు ప్రకటించిన పళనిస్వామి

● వివక్షత లేకుండా అందిస్తామని ఏఐడీఎంకే అధినేత ప్రకటన



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముంగిట ప్రజలపై హామీల వర్షం కురుస్తోంది. ఇప్పటికే రెండు విడతల్లో హామీలు ప్రకటించిన అన్నాడీఎంకే.. తాజాగా జయలలిత వర్ధంతి సందర్భంగా మంగళవారం మూడో విడత ఎన్నికల హామీలను పళనిస్వామి ప్రకటించారు. ఐదేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అండగా ఉండేందుకు ప్రతి కుటుంబానికి రూ.10,000 నగదు సాయం చేస్తామని హామీ ఇచ్చారు.పళనిస్వామి మాట్లాడుతూ... "ప్రకటించిన పథకాలన్నీ అమలు చేస్తాం. ప్రతి కుటుంబానికి ఎటువంటి వివక్షత లేకుండా అందిస్తాం. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఏఐడీఎంకే ప్రభుత్వం కోవిడ్ కాలంలో అద్భుతమైన పాలనను అందించింది. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం ద్వారా మేము ప్రకటించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తాం. అందరికీ చేరేలా చూస్తాం. నిరుద్యోగ యువత కోసం దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 2015లో పెట్టుబడిదారుల సమావేశాన్ని నిర్వహించారు. పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి 2019లో మళ్లీ పెట్టుబడిదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఫలితంగా కొత్త పరిశ్రమలు స్థాపించబడ్డాయి. అదే విధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తాం. డిఎంకే ప్రభుత్వం వెంటిలేటర్ ఉంది. దీంతో ప్రజలు బాధపడుతున్నారు." అని అన్నారు."ప్రతి కుటుంబానికి రూ. 10,000 సహాయ సహాయం అందిస్తాం. ఉపాధి ఎక్స్ఛేంజీలలో నమోదు చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గ్రాడ్యుయేట్లకు నెలకు రూ. 2,000 సాయం చేస్తాం. హయ్యర్ సెకండరీ (ం2) వరకు చదివి ఉపాధి ఎక్స్ఛేంజీలలో నమోదు చేసుకున్న వారికి నెలకు రూ. 1,000 సహాయం అందించబడుతుంది. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఉపశమన మొత్తాన్ని ప్రస్తుతమున్న రూ. 8,000 నుంచి రూ. 12,000 కు పెంచుతాం. ప్రతి సంవత్సరం థాయ్ పొంగల్ నాడు అందించే పొంగల్ గిఫ్ట్ హ్యాంపర్‌తో పాటు, రూ. 1,000 కూడా ఇస్తాం.చేతివృత్తి వాళ్లకు ఉచిత విద్యుత్ అమలు. హ్యాండ్‌లూమ్ 300 నుంచి 450 యూనిట్లు, పవర్‌లూమ్ 1,000 నుంచి 1,400 యూనిట్లు అమలు చేస్తాం." అని పళనిస్వామి పేర్కొన్నారు.


# పేరు మార్చుకున్న దేవ భూమి

● కేరళ పేరు.. ఇక కేరళం ● ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్

● ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు

● విజయన్ ప్రభుత్వానికి భాజపా మద్దతు

● తాజా అధికారిక చర్యలతో సాకారమైన కల



తిరువనంతపురం: దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరు మారనుంది. ఈ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళం గా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసిన సంగతి తెలిసిందే. అధికారిక రికార్డుల్లో రాష్ట్రం పేరును సవరించాలంటూ తీసుకువచ్చిన తీర్మానానికి ఇటీవల కేరళ శాసనసభ ఆమోదం తెలపగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ దానిని పరిగణనలోకి తీసుకుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. తమ రాష్ట్రం పేరును పూర్వం నుంచే మలయాళంలో 'కేరళం' అని పిలిచేవారని అప్పట్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ గుర్తు చేశారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారని ఆయన తెలిపారు. కాగా.. ఈ విషయంలో విజయన్ ప్రభుత్వానికి భాజపా మద్దతు ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ సీఎంకు లేఖ రాశారు. దానికి ముఖ్యమంత్రి బదులిస్తూ.. "రాష్ట్రం అసలు పేరు కేరళం. కానీ బ్రిటిషర్లు తమ సౌకర్యం కోసం కేరళగా మార్చారు. వారు చేసిన మార్పులను రాష్ట్ర సంస్కృతికి అనుగుణంగా సరిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు.

**ఉద్యోగులకు సీఎంఓ సందేశాలు పంపొద్దు: కేరళ హైకోర్టు ఆదేశాలు**

ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే..?

ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే.. మార్పునకు ప్రతిపాదన చేస్తూ చేసిన తీర్మానానికి ఆ శాసనసభలో ఆమోదం లభించాలి. ఈ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. అయితే ఆ అభిప్రాయాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. తర్వాత రాష్ట్రపతి సిఫార్సు మేరకు పేరు మార్పు బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజార్టీ సరిపోతుంది. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ప్రక్రియకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఆర్టికల్ 3 ప్రకారం సాధారణ చట్టం ద్వారానే చేయవచ్చు. అనంతరం రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లో మార్పులు చేస్తారు

# అంతరిక్ష ప్రయోగాల్లో చైనా దూకుడు


● నాలుగోసారి రహస్య అంతరిక్ష విమానం ప్రయోగం

● గతంలో గరిష్టంగా 8 నెలల పాటు కక్ష్యలో నౌక



బీజింగ్ : అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనల్లో తనదైన మార్క్ చూపుతోన్న చైనా.. తాజాగా తన రహస్య అంతరిక్ష విమానం షెన్‌లాంగ్‌ను మరోసారి భూకక్ష్యలోకి పంపింది. ఫిబ్రవరి 7న జియుక్వాన్ శాటిలైట్ లాంచింగ్ సెంటర్ నుంచి లాంగ్‌మార్చ్-2ఎఫ్ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి దీనిని పంపించినట్లు సమాచారం. షెన్‌లాంగ్‌ను భూ కక్ష్యలోకి చైనా ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. కానీ, అంతరిక్ష విమాన యాత్రకు సంబంధించిన సమాచారం విషయంలో చైనా అత్యంత గోప్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఈ ప్రయోగాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ విమానం ఏం చేస్తుందనేది మాత్రం ఎవరికీ అంతుబట్టడం లేదు. కాగా, అమెరికాకు కౌంటర్‌గా అంతరిక్ష సహకారంలో చైనా, రష్యాల మధ్య అవగాహన కుదిరిన సంగతి తెలిసిందే.

అయితే, చైనా మాత్రం భవిష్యత్తులో అంతరిక్షాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవడం, తక్కువ వ్యయంతో ప్రయోగాలు నిర్వహణ వంటి అంశాలపై అధ్యయనం కోసమే దీనిని చేపట్టామని చెబుతోంది. కానీ, ఆ విమానం డిజైన్, లక్ష్యాలు, కక్ష్యలో ఎన్ని రోజులు ఉంటుందనే వివరాలను మాత్రం బీజింగ్ వెల్లడించడం లేదు. ఈ నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన అంతరిక్ష పరిశోధకులు, ఉపగ్రహాలు భూ కక్ష్యలోని షెన్‌లాంగ్‌ను ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.గతంలో షెన్‌లాంగ్ ప్రయోగించినప్పుడు ఇది కనిష్ఠంగా రెండు రోజుల నుంచి గరిష్ఠంగా 8 నెలల వరకు భూకక్ష్యలో ఉన్నట్లు గుర్తించారు. ఒక సందర్భంలో కక్ష్యలోకి చిన్న చిన్న ఉప గ్రహాల వంటివి విడుదల చేసినట్టు గమనించామని తెలిపారు. కానీ, దీని గురించి కచ్చితమైన సమాచారం ఎవరి వద్దా లేకపోవడం గమనార్హం. ఇక, 2020 నుంచి ఈ తరహా ప్రయోగాలను చైనా చేపడుతోంది.ఈ అంతరిక్ష నౌక అమెరికా స్పేస్ ఫోర్స్ కక్ష్యలో అత్యంత కీలకమైన మిషన్ల కోసం వినియోగించే మానవరహిత బోయింగ్ ఔ-37దీను పోలి ఉంటుంది. అమెరికాకు పోటీగా చైనా రూపొందించిన షెన్‌లాంగ్ సాధారణ ఉపగ్రహాలు కంటే ఎక్కువగా భూ దిగువ కక్ష్యలో చాకచక్యంగా వ్యవహరిస్తుందని నమ్ముతారు. అయితే, ఇవన్నీ ఊహాజనితమే, ఎందుకంటే చైనా ఎటువంటి సమాచారం బయటపెట్టలేదు. ఈ రహస్యాన్ని పక్కనబెడితే.. తరుచూ ఈ ప్రయోగాలను చేపట్టడంతో అంతరిక్ష సాంకేతికతలో చైనా ఆసక్తిని స్పష్టంగా తెలియజేస్తుంది.







## సోము వీర్రాజుపై బొత్స వ్యక్తిగత దాడి

- సోము వీర్రాజుపై బొత్స వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం
- బొత్స వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి
- సభ్యులను మెప్పించడానికి మేం సభకు రాలేదు
- వాకౌట్ చేయడం ప్రతిపక్ష నేత బొత్సకు ఫ్యాషన్
- శాసనమండలిలో వైసీపీ సభ్యుల తీరుపై తీవ్రంగా మండిపడ్డ మంత్రి లోకేష్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్ సోము వీర్రాజుపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ఇది వ్యక్తిగత దాడే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. శాంతిభద్రతల అంశంపై మండలిలో స్వల్ప కాలిక చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటలయుద్ధం జరిగింది. వైసీపీ హయాంలో చిలకలూరిపేటలో ప్రధాని సభను సరిగా నిర్వర్తించలేదని, దీంతో ఆ ఎస్పీని బదిలీ చేశారని, వైసీపీ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఎత్తిచూపారు. దీనిపై వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం లేవనెత్తారు. సోము వీర్రాజు తన అవసరం కోసం ఎవరినో మెప్పించడానికి, భజన చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ, ప్రధాని ప్రస్తావన తీసుకురావడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వైసీపీ సభ్యులు నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడి, లేనిపోని ఆరోపణలు చేసి వాకౌట్ చేయడాన్ని హోంమంత్రి అనిత తప్పుబట్టారు. అటు బొత్స వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేష్ తీవ్రంగా మండిపడ్డారు. బొత్స వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. సభ్యులను మెప్పించడానికి మేం ఇక్కడకు రాలేదు. ఆ రోజు ప్రధాని సభలో మేమంతా పాల్గొన్నాం. ఆ రోజు ఎంత ఇబ్బంది పడ్డామో మాకు తెలుసు. కనీస భద్రత కల్పించలేదు, బ్యారికేడ్లు విరిగిపోయాయి. ఆనాడు ప్రధాని గారు మాట్లాడుతున్న సమయంలో మైక్ కూడా కట్ అయింది. దీని తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటీసు జారీచేసి అధికారులను సస్పెండ్ చేసిన విషయం బొత్స తెలుసుకోవాలి. వాకౌట్ చేయడం ప్రతిపక్ష నేత బొత్సకు ఫ్యాషన్, ప్యాషన్. ఈ తలుపు నుంచి వస్తారు, ఆ తలుపు నుంచి వెళ్తారు. శాంతిభద్రతలపై చర్చ జరుగుతున్నప్పుడు ఎందుకు వాకౌట్ చేస్తున్నారు? వాస్తవాలను చెప్పాల్సిన బాధ్యత మాపై లేదా? వినాల్సిన బాధ్యత వారిపై లేదా? రెండు గంటలు కాగానే వారికి ఆకలేస్తుంది. దీంతో వాకౌట్ అని బయటకు వెళ్తారు. టైం చూశారు.. రెండు అయిందా లేదా అని. బొత్స అభ్యంతరకర పదాలను వినియోగించారు. సోము వీర్రాజు ఎవరో ఒకరిని మెప్పించాలనో, ఒక పార్టీని మెప్పించాలనో చూస్తున్నారంటూ ఆయనపై వ్యక్తిగత దాడికి దిగారని మండిపడ్డారు. ఇది సరికాదని, బొత్స వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఛైర్మన్ ను కోరారు.

### వైసీపీ హయంలో 43,948 మంది

## అనర్హులకు ఇళ్ల పట్టాలు


- పరిశీలనలో ఇంకా 1,11,037 మంది లబ్దిదారులు
- పేదలకు ఇళ్ల పేరుతో దోచుకున్న జగన్ సర్కార్
- అందరికీ ఇళ్లు పథకం కింద కొత్తగా 4,08,876 దరఖాస్తుల రాక
- శాసనసభలో మంత్రి అనగాని సత్యప్రసాద్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి వైసీపీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో 6 వేల కోట్ల రూపాయాల కుంభకోణాలకు పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గత ప్రభుత్వం 22 లక్షల మంది ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 7 లక్షల మంది కన్వేయన్స్ డీడ్లే తీసుకోలేదన్నారు. ఇళ్ల పట్టాల కోసం నివాస యోగ్యం కాని పల్లపు భూములు, శశ్మానాలు, ఊరికి దూరంగా ఉండే భూములు, వర్షాలకు మునిగి పోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక రేట్లు ఇచ్చి సేకరించరాని చెప్పారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేని కారణంగా రెండున్నర లక్షల మంది ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం విచారణ చేయించగా 43,948 మంది అనర్హులు తేలినట్లు చెప్పారు. పరిశీలనలో ఇంకా 1,11,037 లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ ఇళ్లు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర, సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మొత్తం 4,08,876 దరఖాస్తులు ఇళ్ల పట్టాల కోసం వచ్చాయని, ఇందులో 1,03,494 దరఖాస్తులను అమోదించగా 1,41,928 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఇంకా 1,56,454 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు.

## అవినాశ్ రెడ్డీ లొంగిపో


- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం
- రేపటిలోగా విచారణాధికారి ముందు హాజరుకావాలని ఆదేశం
- లిక్కర్ స్కామ్ కేసులో ఏ-7గా ఉన్న వైసీపీ ఎంపీ
- ప్రస్తుతం శ్రీలంకలో తలదాచుకున్న వైనం



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ నిరాశ ఎదురైంది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ను ధర్మాసనం తోసిపుచ్చింది. చట్టం నుంచి తప్పించుకుని విదేశాల్లో తలదాచుకున్నా ప్రయోజనం లేదని, తక్షణమే విచారణకు సహకరించాలని కోర్టు స్పష్టం చేసింది. ఈరోజు జరిగిన విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ముప్పిడి అవినాశ్ రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పడమే కాకుండా, ఈ నెల 26వ తేదీ లోపు సంబంధిత విచారణాధికారి ముందు స్వయంగా హాజరై లొంగిపోవాలని డెడ్ లైన్ విధించింది. చట్టం ముందు లొంగిపోయిన తర్వాతే నిబంధనల ప్రకారం సాధారణ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ కేసు మూలాలు అంతర్జాతీయంగా విస్తరించాయని సుప్రీంకోర్టు గతంలోనే అనుమానం వ్యక్తం చేసింది. లిక్కర్ స్కామ్ ద్వారా అక్రమంగా ఆర్జించిన కోట్లాది రూపాయలను అవినాశ్ రెడ్డి ద్వారా రాజ్ కెసిరెడ్డి విదేశాల్లో దాచారనే ఆరోపణలపై ధర్మాసనం దృష్టిసారించింది. స్కామ్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి దక్కకపోవడంతో, ఇప్పుడు అవినాశ్ రెడ్డి లొంగిపోవడం మినహా మరో మార్గం లేదు.

# కల్తీ నెయ్యి మహా పాపం !

- నెయ్యి సరఫరాలో భారీ కుంభకోణం
- సిట్ నివేదిక ఆధారాలతో బహిర్గతం
- జంతువుల కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేశారు
- టెండర్ నిబంధనలు మార్చి అనర్హ సంస్థలకు కాంట్రాక్టులు
- టీటీడీ చైర్మన్ పీఏ ఖాతాలో రూ.4.69 కోట్ల లంచం ఆనవాళ్లు బయటపడ్డాయి
- గత ప్రభుత్వ పెద్దలు బాధ్యత తీసుకోకపోవడం దుర్మార్గం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన నెయ్యి సరఫరాలో భారీ కుంభకోణం జరిగిందని, ఇది దేవుడికే అపచారం చేసిన మహా పాపమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. మంగళవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదికలో సంచలన విషయాలు ఆధారాలతో సహా ఉన్నాయని అన్నారు. పక్కా ప్రణాళికతో, వ్యవస్థీకృతంగా ఈ స్కామ్కు పాల్పడ్డారని, శ్రీవారి నైవేద్యానికి వాడే నెయ్యిని ప్రమాదకరమైన రసాయనాలు, జంతువుల కొవ్వుతో కల్తీ చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేవుడి విషయంలో జరిగిన ఈ మహా పాపంపై గత ప్రభుత్వ పెద్దలు బాధ్యత తీసుకోకుండా, బుకాయించడం దుర్మార్గమని ఆయన వ్యాఖ్యానించారు.

నిబంధనల మార్పుతో మొదలైన కుట్ర : ఈ కుంభకోణానికి బీజం టెండర్ నిబంధనల మార్పుతోనే పడిందని చంద్రబాబు వివరించారు. తమకు అనుకూలమైన, అనర్హత ఉన్న సంస్థలకు కాంట్రాక్ట్ కట్టబెట్టేందుకు గత ప్రభుత్వం నిబంధనలను పూర్తిగా నీరుగార్చిందని ఆరోపించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలనే నిబంధనను పూర్తిగా తొలగించారు. నెయ్యి తయారీలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. డైరీల వార్షిక టర్నోవర్ను రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్ వంటి కీలక ప్రక్రియలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. ఈ మార్పులతో అర్హత లేని 'బోలే బాబా', 'వైష్ణవి డైరీ' వంటి షెల్ కంపెనీలకు నెయ్యి సరఫరా చేసే అవకాశం కల్పించారని సీఎం పేర్కొన్నారు.

జంతువుల కొవ్వు, డిటర్జెంట్లతో కల్తీ సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యే కాదని, అది రసాయనాల మిశ్రమమని సిట్ నివేదికలోని అంశాలను చంద్రబాబు ఉటంకించారు. నెయ్యి తయారీకి రిఫైన్డ్ పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్ను బేస్గా వాడారని తెలిపారు. రంగు కోసం 'బీటా కెరాటిన్', వాసన కోసం 'ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్', నురుగు కోసం డిటర్జెంట్లలో వాడే 'లబ్సా యాసిడ్' వంటి ప్రమాదకర రసాయనాలు వాడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, 2024 జూలైలో వచ్చిన ఎన్డీబీ నివేదిక ప్రకారం నెయ్యిలో జంతువుల కొవ్వు (బీఫ్ టాలో) అవశేషాలు ఉన్నట్లు తేలిందని, ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల లంచాలు, నివేదికల తొక్కివేత : ఈ మొత్తం వ్యవహారంలో భారీగా లంచాలు చేతులు మారాయని చంద్రబాబు ఆరోపించారు. అప్పటి టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న బ్యాంకు ఖాతాలో రూ.4.69 కోట్ల లంచం డబ్బును సిట్ గుర్తించిందని తెలిపారు. కిలో నెయ్యికి రూ.25 చొప్పున చిన్నపన్న కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపించారు. ప్లాంట్ తనిఖీలకు వెళ్లిన అధికారులకు ఖరీదైన ఫోన్లు, బంగారం, వెండి నాణేలు లంచంగా ఇచ్చి అనుకూల నివేదికలు తెచ్చుకున్నారని అన్నారు. 2022లోనే సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ అని (బీటా సిటోస్ట్రాల్ పాజిటివ్) స్పష్టంగా ఉన్నా, అప్పటి టీటీడీ బోర్డు ఆ నివేదికను తొక్కిపెట్టిందని చంద్రబాబు ఆరోపించారు. బ్లాక్లిస్ట్లో పెట్టినప్పటికీ 'బోలే బాబా' సంస్థ 'వైష్ణవి', 'మాల్గంగ' వంటి షెల్ కంపెనీల ద్వారా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించిందని వివరించారు.

సిట్ దర్యాప్తులో భాగంగా నకిలీ ల్యాబ్ రిపోర్టులు, ఫేక్ ఇన్వాయిస్లు, లంచాల వివరాలున్న డైరీలు, రసాయనాల డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసులో నేరపూరిత కుట్ర (120బి), ఆహార కల్తీ (272, 273), మోసం (420), మత మనోభావాలను దెబ్బతీయడం (295ఏ), అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు చంద్రబాబు సభకు వివరించారు.

## అమృతమా? కాలకూట విషమా?

- పాలు..పాపాల వెనుక విస్తు పోయే నిజాలు
- పాలను యథేచ్ఛగా కల్తీ చేస్తున్నారు
- రాజమహేంద్రవరం సంఘటన తరువాత కళ్ళు తెరిచిన ప్రభుత్వం
- నిద్రావస్తలో ఫుడ్ సేఫ్టీ అధికారులు
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కల్తీ పాలు..!




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి గోదావరి తీరాన పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరొందిన రాజమహేంద్రవరంలో ఇలాంటి 'తెల్లటి విషం' వ్యాపారం సాగడం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. అక్కడ వెలుగుచూసిన కల్తీ పాల ఉదంతం కలకలం రేపుతోంది. గోదావరి తీరాన పవిత్రమైన పుణ్యక్షేత్రంగా పేరొందిన రాజమహేంద్రవరంలో ఇలాంటి 'తెల్లటి విషం' వ్యాపారం సాగడం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. కల్తీ పాలు తాగిన నలుగురు ఇప్పటికే మరణించగా, మరో 12 మంది మృత్యువుతో పోరాడుతున్నారు. అదేసమయంలో కల్తీ పాలు తాగిన బాధితులు వైద్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక వైద్య శిబిరాల్లో బారులు తీరుతున్నారు. వైద్య పరీక్షల నివేదిక కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ప్రతి ఉదయం మన గుమ్మం ముందు వినిపించే పాలవాడి పిలుపు ఆరోగ్యానికి నాంది అనుకుంటాం. ఇంటిల్లి పాది మొత్తం పాలవాడు తెచ్చే పాలతోనే రోజును ఆరంభిస్తుంటారు. వృద్ధులు, పిల్లలు ఒకరేంటి ప్రతి ఇంటా పాలు లేనిదే రోజు గడవని పరిస్థితి. అంత ముఖ్యమైన పాలను విషంగా మార్చి విక్రయించడానికి మించిన నేరం లేదని అంటున్నారు. అమృతంలా భావించి మనం తాగే ఆ కప్పు టీ కాలకూట విషంగా మారి మన ప్రాణాలను కబళించే స్థితిలో ఉంటే.. ఆ భయాన్ని మాటల్లో వర్ణించగలమా? తెల్లటి పాల వెనుక దాగున్న నల్లటి నిజాలు షేక్ చేస్తున్నాయి. రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో పాలు కల్తీపై మరోసారి విస్తృత చర్చ జరుగుతోంది. వ్యాపారంలో లాభాల కోసం కొందరు చేస్తున్న పాపమే కల్తీ పాల వ్యాపారంగా చెప్పవచ్చు. పాలను చిక్కగా చేసేందుకు, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు వాడే రసాయనాలు శరీరంలోని ముఖ్య అవయవాలను దెబ్బతీస్తున్నాయి. రాష్ట్రంలో డెయిరీలకు సరఫరా చేస్తున్న పాలలో సైతం ఇలాంటి కల్తీలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలను కల్తీ చేసేందుకు వ్యాపారులు వాడుతున్న సరుకులు భీతి గొలుపుతున్నాయి. గతంలో వెలుగు చూసిన కొన్ని ఉదంతాల్లో పాలను ఎలా కల్తీ చేస్తున్నారో గుర్తించారు. పాలను నురగ వచ్చేలా చేసేందుకు యూరియా, డిటర్జెంట్స్ లిక్విడ్ సోపులను వాడుతున్నట్లు చెబుతున్నారు. ఇవి కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. దీర్ఘకాలంలో కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగిన వారు ముందుగా అస్వస్థతకు గురయ్యారు. గంటల వ్యవధిలోనే వారి కిడ్నీలు ఫెయిలై ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు. బాధితులకు మూత్రం నిలిచిపోవడం గ గకొనసాగింపుమనిస్తే పాలలో ఖచ్చితంగా యూరియా కలిసి వుంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాలు విరిగిపోకుండా కొందరు ఫార్మాలిన్ కలుపుతుంటారని చెబుతున్నారు. నిజానికి ఇది శవాలను కుళ్లిపోకుండా ఉంచేందుకు వాడే రసాయనంగా చెబుతున్నారు. ఇది శరీరంలోకి వెళ్తే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో పాలు కల్తీ వల్ల 87 శాతం మంది క్యాన్సర్ ముప్పు ఎదుర్కొంటున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018లోనే హెచ్చరించింది. ఇక కొందరు సింథటిక్ మిల్క్ తయారు చేస్తూ యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారని అంటున్నారు. యూరియా, కాస్టిక్ సోడా, శుద్ధి చేసిన నూనె కలిపి ఈ పాలు తయారు చేస్తుంటారని అంటున్నారు. ఇవి విషంతో సమానం. గుండె సంబంధిత వ్యాధులను కలిగించడమే కాకుండా అధిక రక్తపోటుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే పాల కల్తీని కొద్దిపాటి జాగ్రత్తలతో ఇంట్లోనే సులభంగా గుర్తించవచ్చని చెబుతున్నారు

ంకల్తీని గుర్తించడం ఎలా?

పాలలో నీళ్లు కలిపారో లేదో తెలుసుకోవడానికి చిట్కాలు ఉన్నట్లే.. రసాయనాలతో తయారుచేసిన పాలను కూడా ఇంట్లోనే తేలిగ్గా గుర్తుపట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో గచ్చుపై ఒక చుక్క పాలను వేయడం ద్వారా పాలు స్వచ్ఛమైనవా కాదా అని తేలికగా తెలుసుకోవచ్చని అంటున్నారు. పాలు స్వచ్ఛమైనవి అయితే, అవి నెమ్మదిగా కదులుతూ వెనుక ఒక తెల్లటి గీతగా ఉంటుందని, అదే కల్తీ చేసిన పాలు అయితే, ఎటువంటి గీత లేకుండా వేగంగా కిందకు జారిపోతాయని అంటున్నారు. అదేవిధంగా పాలల్లో డిటర్జెంట్ లేదా సోప్ వాటర్ కలిపితే అవి విషపూరితంగా మారుతాయి. దీనిని గుర్తు పట్టడానికి ఒక గాజు గ్లాసులో కొద్దిగా పాలను తీసుకుని అంతే మోతాదులో నీరు కలిపి, వాటిని బాగా షేక్ చేయాలని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల దట్టమైన నురుగు వచ్చి, అది చాలా సేపటి వరకు తగ్గకపోతే అందులో డిటర్జెంట్ కలిపినట్లుగా అనుమానించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా యూరియా కలిపిన పాలు రుచిని మార్చవు కానీ ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అంటున్నారు. ఒక స్పూన్ పాలను తీసుకుని అందులో అర స్పూన్ సోయాబీన్ పొడి లేదా కందిపప్పు పొడి వేసి ఐదు నిమిషాల తర్వాత చూస్తే పాలలో యూరియా ఉందా? లేదా? అన్న విషయం తెలిపోతుందని చెబుతున్నారు. కందిపప్పు పొడి కలిపిన తర్వాత అందులో ఎర్రటి లిట్మస్ పేపర్ ఉంచాలని, ఆ పేపర్ నీలం రంగులోకి మారితే అందులో యూరియా ఉన్నట్లు అర్థం చేసుకోవాలని అంటున్నారు. అదేవిధంగా సింథటిక్ పాలును కూడా ఇంట్లోనే తేలిగ్గా గుర్తించవచ్చని అంటున్నారు. సింథటిక్ పాలుగా అనుమానం వస్తే వెంటనే ఆ పాలను అరచేతిలో పోసుకుని బాగా రుద్దడం ద్వారా కల్తీని గుర్తించవచ్చని అంటున్నారు. పాలలో సోపు తగిలినట్లు జిగటగా అనిపిస్తే అవి సింథటిక్ పాలు అని గుర్తించాలని చెబుతున్నారు. అదేవిధంగా సింథ.

## తిరుమల ప్రతిష్టతో లడ్డూ కల్తీపై వైసీపీ రాజకీయం

- తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై అసెంబ్లీలో లఘు చర్చ
- నిబంధనలు సడలించడంతోనే కల్తీకి మార్గం : మంత్రి ఆనం
- అసలు దోషుల గుర్తింపుకు ఏకసభ్య కమిటీ, సమగ్ర దర్యాప్తు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో లఘు చర్చ నిర్వహించారు. ఈ క్రమంలో ఈ అశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సహా పలువురు మాట్లాడారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీలో అసలు దోషుల్ని గుర్తించేందుకే ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేసిందని దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. తిరుమలకు నిజమైన నెయ్యి సేకరించేందుకు టెండర్ నిబంధనలు కఠినంగా ఉండేవని, 2020 ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం నిబంధనలు తొలగించారని మంత్రి తెలిపారు. ఆ తర్వాత అనుభవం లేని ప్రైవేట్ డెయిరీలు ప్రవేశించి తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేస్తున్నట్లు చెప్పి కల్తీ నెయ్యి ఇచ్చాయని ఆయన వివరించారు. మంత్రి వివరాల ప్రకారం, 2014 నుంచి ఈ-టెండర్ల ద్వారా అగ్మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి సేకరణ కొనసాగింది. అయితే 2020 ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం టెండర్ నిబంధనలను సడలించడంతో అనుభవం లేని ప్రైవేట్ డెయిరీలు ప్రవేశించాయని చెప్పారు. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏటికి తగ్గించడం, వార్షిక టర్నోవర్ అర్హతను తగ్గించడం, పాల కొవ్వు ప్రమాణాలను సవరించడం, తప్పనిసరి పాల సేకరణ నిబంధన తొలగింపు వంటి మార్పులు కల్తీకి దారితీశాయని పేర్కొన్నారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో తొలుత కేసు నమోదై, అనంతరం ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తరువాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్ పునర్వ్యవస్థీకరించబడిందన్నారు. భోలేబాబా, వైష్ణవి తదితర డెయిరీలు తక్కువ ధరకు టెండర్లు కోట్ చేసి సరఫరా ప్రారంభించాయని సిట్ గమనించిందన్నారు. ఏకసభ్య కమిటీ సిఫార్సుల మేరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

సమగ్ర దర్యాప్తు కావాలి : ధూళిపాళ్ల పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ, కల్తీ ద్వారా దోచుకున్న డబ్బులు ఎవరికి చేరాయో తేల్చాలని డిమాండ్ చేశారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ల ప్రస్తావన సిట్ నివేదికలో ఎందుకు లేదని ప్రశ్నించారు. నిబంధనలు మార్చి టెండర్లు తమకు అనుకూలంగా మళ్లించారని ఆరోపించారు. సిట్ దర్యాప్తు పూర్తిస్థాయిలో జరగలేదని, సమగ్ర విచారణ అవసరమని కోరారు.

అసత్య ప్రచారాలు అలవాటు : కూన రవికుమార్ ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ హయాంలో తిరుమలపై అసత్య ప్రచారాలు జరిగాయని విమర్శించారు. పింక్ డైమండ్ అంశంపై కోర్టు కేసులు వేసి తరువాత వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరిగిందని, బస్సు టికెట్ల వెనుక హజ్, జెరూసలేం యాత్రల వివరాలు ముద్రించారని ఆరోపించారు. బాధ్యులందరికీ శిక్ష తప్పదు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నిజమైన బాధ్యులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తిరుమల విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, జరిగిన తప్పులను సరిదిద్దే చర్యలు ఇప్పటికే ప్రారంభించామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 62 నుంచి 65కు పెంపు

### హైకోర్టు కీలక ఆదేశాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఏపీ వ్యవసాయశాఖ పరిధిలోని నాలుగు యూనివర్సిటీల ప్రొఫెసర్లకు హైకోర్టులో రిలీఫ్ దక్కింది. యూజీసీ స్కేల్ తీసుకుంటున్న వారి పదవీ విరమణ వయసుపై కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ యూనివర్సిటీలలో ప్రొఫెసర్లకు పదవీ విరమణ వయసు పెంచకపోవడాన్ని హైకోర్టు ధర్మాసనం తప్పుబట్టింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు వారిని సర్వీసులో కొనసాగించాలని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న నాలుగు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు హైకోర్టులో ఊరట దక్కింది. వీరి పదవీ విరమణ వయసును పెంచకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. కొంతమందికి పదవీ విరమణ వయసును పెంచి మరికొందరికి పెంచకపోవడం వివక్ష చూపడమేనని వ్యాఖ్యానించింది. చట్టం ముందు అందరూ సమానమేనని.. ప్రభుత్వ చర్య అధికరణ 14కు విరుద్ధంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నాలుగు యూనివర్సిటీలలో (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన, శ్రీవేంకటేశ్వర వెటర్నరీ, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలు) కొందరు ప్రొఫెసర్లు (పిటిషనర్లు) పదవీ విరమణ చేయబోతున్నారని.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు వారిని సర్వీసులో కొనసాగించాలని ఆదేశించింది. అంతేకాదు ఈ నెల 15న నాలుగు యూనివర్సిటీల పరిధిలో ప్రొఫెసర్ల పదవీవిరమణ వయసు పెంచడానికి వీల్లేదని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ జారీ చేసిన ఆదేశాలను కూడా ఏపీ హైకోర్టు సస్పెండ్ చేసింది. ఏపీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ పరిధిలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు (యూజీసీ స్కేల్ పొందుతున్నవారు) పదవీవిరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచింది. కానీ వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న నాలుగు వర్సిటీల్లో ప్రొఫెసర్లకు మాత్రం పదవీవిరమణ వయస్సు పెంచలేదు. దీంతో వారంతా ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.

## రాజమండ్రి కల్తీ పాలు ఘటనపై

### వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ బులిటెన్ విడుదల



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిరాజమహేంద్రవరం నగర పరిధిలో నమోదైన పాల కల్తీ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన నివేదిక ఆధారంగా మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ కీర్తి చేకూరి వివరాలు వెల్లడించారు. 22 ఫిబ్రవరి నాడు కిమ్స్ ఆస్పత్రి నుండి జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి సమాచారం అందగా, లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరనగర్, స్వరూప్నగర్ ప్రాంతాలకు చెందిన పలువురు వృద్ధులు అనూరియా, వాంతులు, పొత్తికడుపు నొప్పి, తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో ఆసుపత్రిలో చేరినట్లు గుర్తించారు. రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయులు అధికంగా ఉండటం వల్ల విషపూరిత ప్రభావం ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక ఎపిడెమియాలజికల్ పరిశీలనలో పాల వినియోగమే ప్రధాన కారణమని తేలింది. నరసాపురం గ్రామం, కోరుకొండ మండలంలోని వరలక్ష్మి మిల్క్ డెయిరీ నుండి 106 కుటుంబాలకు పాల సరఫరా జరిగినట్లు గుర్తించి, వెంటనే సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం ఈ ఘటనలో 4 మరణాలు నమోదయ్యాయి. 15 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో 7 మంది ప్రమాదం నుంచి బయటపడ్డారు. మిగిలిన వారు వెంటిలేటర్, డయాలిసిస్ సహాయంతో చికిత్స పొందుతున్నారు. బాధితులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఘటనపై వెంటనే ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసి జిల్లా పర్యవేక్షణ అధికారి, వైద్య నిపుణులు, సూక్ష్మజీవ శాస్త్రవేత్తలు, నెఫ్రాలజిస్టులు తదితరులతో కూడిన బృందాలు రంగంలోకి దిగాయి. 14 ఫీల్డ్ సర్వేలెన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి. 110 కుటుంబాల్లో 293 మందిని గుర్తించి 315 రక్త నమూనాలు సేకరించగా, వాటిలో 313 సాధారణంగా ఉండగా 2 మందిలో యూరియా, క్రియాటినిన్ స్థాయులు పెరిగినట్లు వెల్లడైంది. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆహార భద్రత శాఖ అధికారులు వరలక్ష్మి మిల్క్ డెయిరీ వద్ద తనిఖీలు నిర్వహించి పాలు, పనీర్, నెయ్యి, తాగునీరు, వెనిగర్ నమూనాలను సేకరించారు. ప్రభావిత ఇళ్ల నుంచి కూడా పాలు, పెరుగు నమూనాలు తీసుకున్నారు. వీటిని పరీక్షల కోసం జె ఎన్ టీయు, కాకినాడ మరియు విమ్టా కు పంపించారు. సూక్ష్మజీవ, భౌతిక-రసాయన, విషపూరిత కల్తీ పదార్థాల పరీక్షలు జరుగుతున్నాయి. పోలీసు శాఖ 3 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లో క్రైం నెం. 90/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అనుమానిత పాల సరఫరాదారుని అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తోంది. మృతదేహాల నమూనాలను ప్రాంతీయ ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. అలాగే పశుసంవర్ధక శాఖ నాలుగు వెటర్నరీ వైద్యులతో బృందాన్ని ఏర్పాటు చేసి 41 పాల నమూనాలు, పశువులకు ఇచ్చే ఆహారం, నీటి నమూనాలను సేకరించి కు పంపించింది. అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టడంతో పరిస్థితి ప్రస్తుతం నియంత్రణలో ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ర్యాపిడ్ రెస్పాన్స్ ü ఫీల్డ్ సర్వే వివరాలు జిల్లా పర్యవేక్షణ అధికారి, వైద్య నిపుణులు, సూక్ష్మజీవ శాస్త్రవేత్తలు, బాల వైద్యులు, నెఫ్రాలజిస్టులు, ఫోరెన్సిక్ నిపుణులతో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేశారు. 14 ఫీల్డ్ బృందాలు,679 ఇళ్ల సందర్శన,957 కుటుంబాల స్క్రీనింగ్,110 కుటుంబాల్లో 293 మంది యూరియా/క్రియాటినిన్ పెరుగుదల మరణించిన వారి పాల కల్తీ ఘటనలో 4 మంది మరణించారు.




# మంటల్లో మెక్సికో

## డ్రగ్ మాఫియా కింగ్ ఎల్ మంచో హతం
## పోలీస్ స్టేషన్లే లక్ష్యంగా ఆందోళనకారుల విధ్వంసం

**మెక్సికోలో ఇంత అలజడి రేగితే, ఇంతటి హింసాత్మక అల్లర్లు సాగుతుంటే.. జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయా, పోలీస్ స్టేషన్లే లక్ష్యంగా ఆందోళనకారురాళ్లు రువ్వుతూ, క్వాలకు తెగబడుతున్నారు. భయాందోళనకు గురైన ప్రజ ఇళ్లకే పరిమితమవగా, విద్యాసంస్థ, వ్యాపార సముదాయామూతపడ్డాయి. మెక్సికో వీధులన్నీ పగిలిన గాజు ముక్క, కాలిపోయిన వాహనాల శకలాలతో.. అల్లకల్లోల వాతావరణంలో కనిపిస్తున్నాయ్. మరిన్ని వివరాలలోకి వెళితే...**

ప్రపంచంలోనే అత్యంత క్రూరమైన డ్రగ్ మాఫియా డాన్ లలో ఒకడైన ఎల్ మెంచో మెక్సికో సైన్యం చేపట్టిన భారీ ఆపరేషన్‌లో హతమయ్యాడు. ఈ విషయాన్ని మెక్సికో రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ధృవీకరించింది. ఈ వార్త తెలియగానే ఎల్ మెంచో నాయకత్వం వహిస్తున్న జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ (సీఎన్జీ) సభ్యులు జాలిస్కో, గ్వాడల జారా వంటి ప్రధాన నగరాల్లో విధ్వంసానికి తెగబడ్డారు. హైవేలపై వాహనాలకు నిప్పుపెట్టారు. రోడ్లను దిగ్బంధిచారు. దీంతో అధికారులు కోడ్ రెడ్ ప్రకటించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. అమెరికాలోకి భారీగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఎల్ మెంచో అగ్రరాజ్యానికి పెద్ద తలనొప్పిగా మారాడు. అందుకే, అతడి ఆచూకీ తెలిపిన వారికి అమెరికా ప్రభుత్వం 15 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ. 125 కోట్లు) భారీ రివార్డును ప్రకటించింది. కాగా ఎన్ మెంచో హతమైన నేపథ్యంలో మెక్సికోలో పరిస్థితులు ఆద్రిక్తంగా మారాయి. దీంతో అమెరికా, కెనడా ప్రభుత్వాలు మెక్సికోలో నివసిస్తున్న తమతమ దేశాల పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించాయి. ఎయిర్ కెనడా వంటి సంస్థలు తమ విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి.

### మెక్సికో స్పెషల్ ఆపరేషన్

అమెరికా నిఘూవర్గాల సమాచారంతో ఎల్ మెంచోను పట్టుకునేం దుకు మెక్సికో సైన్యం ఆదివారం స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. జాలిస్కో స్టేట్‌లోని తపాల్ప టౌన్‌లో ఎల్ మెంచోనక్కిన ప్రాంతాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో మెంచో అనుచరుక్వాజరపగా ఆర్మీ ఎదురుదాడి చేసిం ది. ఈ భీకర ఆపరేషన్‌లో..ఎల్ మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతడని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలిస్తుండగానే చనిపోయినట్లు మెక్సికో సైన్యం ప్రకటించింది. ఎల్ మెంచోతో పాటు అతని డ్రగ్ ముఠాకు చెందిన మరో ఆరుగురు ఈ ఆపరేషన్‌లో మరణించారు. ఈ ఘటనతో మెక్సికోలోని అనేక రాష్ట్రాల్లో హింసాత్మక ఆందోళనచెలరేగా యి. డ్రగ్ మాఫియా డాన్ అనుచరు, డ్రగ్ కార్టెల్స్.. చాలా ప్రాంతాల్లో రోడ్లని దిగ్బంధించారు. వాహనా, సూపర్ మార్కెట్లు, బ్యాంకులను తగలబెట్టారు.



### మెక్సికో సిటీ అంతటా హై -- అలర్ట్ ప్రకటన

ఎల్ మంచో అంతం..కేవలం ప్రభుత్వం వర్సెస్ డ్రగ్ కార్టెల్ మధ్య వార్‌గానే మిగిలిపోలేదు. ఇప్పుడు అతని స్థానాన్ని ఆక్రమించేందుకు, ఇతర చిన్న చిన్న ముఠా, సినాలోవా లాంటి ప్రత్యర్థి కార్టెల్స్ కూడా రంగంలోకి దిగాయ్. దాంతో.. మెక్సికోలో గ్యాంగ్ వార్ తీవ్ర స్థాయికి చేరింది. జాలిస్కోని.. ఈ పరిస్థితుల్లో అత్యంత ప్రమాదకరమైన జోన్‌గా గుర్తించి, కర్ఫ్యూ విధించారు. మెక్సికో సిటీ అంతటా హై-అలర్ట్ ప్రకటించారు. సరిహద్దుల్లోనూ సైన్యం భారీగా మోహరించింది. అమెరికా-మెక్సికో బోర్డర్ దగ్గర కూడా పరిస్థితుసీరియస్‌గానే ఉన్నట్లు త్తోంది. ఈ అల్లర్లు, దాడు, ఆందోళనలన్నీ.. ఎల్ మంచ్ డ్రగ్ కార్టెల్స్‌కి ఎంత ముఖ్యమైనవాడో చెబుతున్నాయ్. అతని పతనంతో.. డ్రగ్ మాఫియా ఇప్పుడు సందిగ్ధంలో పడిపోయింది. ఎల్ మంచో అంతంతో డ్రగ్ మాఫియాపై విజయం సాధించామన్న విజయం కంటే, అక్కడి ప్రభుత్వానికి ఇప్పుడు జరుగుతున్న అల్లర్లను ఆపడమే పెద్ద సవాల్‌గా మారింది.

### ప్రకంపనసృష్టిస్తున్న ఎల్ మెంచో

మెక్సికోలో నెలకొన్న పరిస్థితుఆందోళనకరంగా మారాయ్. ఒకప్పుడు.. ఎల్ చాపో పేరు వింటే ఎలా భయపడేవారో, ఆ తర్వాత ఎల్ మెంచో పేరు అంతకంటే ఎక్కువ ప్రకంపనసృష్టించింది. అతని అంతం తర్వాత ఏర్పడిన శూన్యం.. మెక్సికోని హింసలోకి నెట్టేసింది. డ్రగ్ మాఫియా కింగ్, కరడుగట్టిన నేరస్తుడు ఎల్ మెంచో మృతితో.. మెక్సికో అట్టుడికిపోతోంది.



### ప్రభుత్వానికే సవాల్ విసిరిన ఎల్ మంచోని సైన్యం

మెక్సికో డ్రగ్ మాఫియా సామ్రాజ్యంలో తిరుగులేని శక్తిగా ఎదిగిన ఎల్ మంచో అంతంతో..ఆదేశం అగ్నిగుండంగా మారింది. శక్తిమంతమైన జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ అధినేతని సైన్యం మట్టుబెట్టిందన్న వార్త డ్రగ్ కార్టెల్ సభ్యుల్లో కార్చిచ్చు రగిల్చింది. అందువల్లే.. మెక్సికో వీధియుద్ధ క్షేత్రాలని తలపిస్తున్నాయ్. దశాబ్దాగా డ్రగ్ సామ్రాజ్యాన్ని ఏతూ, ప్రభుత్వానికే సవాల్ విసిరిన ఎల్ మంచోని సైన్యం హతమార్చడమే ఓ సంచలనమైతే, ఇప్పుడు మొదలైన హింస మొత్తం దేశాన్నే అత లాకుతలం చేస్తోంది. జాలిస్కో స్టేట్‌తో పాటు మెక్సికో అంతటా డ్రగ్ కార్టెల్ సభ్యురోడ్లపైకి వచ్చారు. అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. ఈ హింసాత్మక ఆందోళనలని చూస్తుంటే.. మెక్సికోలో డ్రగ్ మాఫియా ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది. పోలీసు, ఆర్మీని లెక్కచేయకుండా, ఎంతకైనా తెగిస్తుందనే విషయం స్పష్టమవుతోంది. తమ డ్రగ్ కార్టెల్ అధినేత మరణాన్ని ప్రతీకారంగా.. వందలాది బస్సు, ట్రక్కులను రోడ్ల మధ్యలో తగలబెట్టేస్తున్నారు. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ భవనాలే లక్ష్యంగా దాడుచేస్తున్నారు. ఈ హింసతో.. సాధారణ ప్రజఇళ్లకే పరిమితమయ్యారు. గాల్లో ఎక్కడ చూసినా తుపాకుల మోత, నల్లటి పొగ కనిపిస్తోంది.

### అసఎవరు ఈ ఎల్ మెంచో

ఎల్ మెంచో అసపేరు నెమెసియో ఒసెగుయెరా సెర్వాంటెస్. 1966లో మిచోకాన్‌లోని ఓ మారుమూల గ్రామంలో పుట్టాడు. ఆ ఏరియాలో.. అవకాడోతో పాటు గంజాయి, నల్లమందు లాంటి ఎక్కువగా సాగు చేస్తుంటారు. తన చిన్నతనంలో అవకాడో పొలాల్లో పనిచేసిన మెంచో.. ఆ తర్వాత 1980ల్లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడు. కాలిఫోర్నియాలో హెరాయిన్ సప్లై చేస్తూ యూఎస్ పోలీసులకు దొరికిపోయాడు. కొన్నేళ్ల పాటు జైశిక్ష అనుభవించిన తర్వాత.. అమెరికా యంత్రాంగం అతడిని మెక్సికోకు అప్పగించింది. స్వదేశానికి వచ్చిన తర్వాత.. కొంతకాలం పాటు పోలీసుగా పనిచేశాడు.

### అక్రమ రవాణా వ్యాపారంలోకి ఎంట్రీ

అదే సమయంలో.. డ్రగ్ మాఫియా కాంటాక్టుతుకొని మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. మొదట్లో.. తొత మెక్సికోలో శక్తిమంతమైన సినావోలా డ్రగ్ కార్టెల్‌కు చెందిన ముఠాలో పనిచేశాడు. కొన్నేళ్ల తర్వాత అక్కడి నుంచి బయటకువచ్చి.. 2009లో సొంతంగా జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ అనే డ్రగ్ ముఠాని ఏర్పాటు చేశాడు. డ్రగ్స్ దందాలో తన శత్రువుల్ని అత్యంత దారుణంగా చంపడం, సోషల్ మీడియాలో ఆ వీడియోలని పోస్ట్ చేసి భయాందోళన సృష్టించడం వీడి స్టైల్. గడిచిన పదేళ్లలో.. మెక్సికోలో అత్యంత శక్తిమంతమైన క్రిమినల్ సిండికేట్‌గా మారాడు. అమెరికాకు ప్రధాన డ్రగ్ సప్లయర్‌గా ఎదిగాడు.

### వామ్మో.. పోలీసుల తలనరికి..

ఎల్ మెంచోకు చెందిన జజీచీ+ ముఠా.. కొన్నేళ్లుగా అమెరికాకు ఫెంటానిల్ లాంటి ప్రమాదకరమైన డ్రగ్స్‌ని అక్రమంగా సప్లై చేస్తోంది. డ్రగ్స్ సరఫరా ఒక్కటే కాదు..ఈ ముఠా దోపిడీ, కిడ్నాప్, హత్యల వంటి అనేక నేరాలకు పాల్పడింది. 2015లో ఆరు వారాల వ్యవధిలోనే, అత్యంత దారుణంగా 20 మందికి పైగా పోలీసుల తలనరికి చంపేసింది. మొన్నటిదాకా.. అమెరికాకు సప్లై అయ్యే సింథటిక్ డ్రగ్స్, ఫెంటానిల్ డ్రగ్ అక్రమ రవాణా వ్యాపారంలో ఎల్ మెంచోదే పైచేయి. చివరకు అమెరికా కూడా జాలిస్కో డ్రగ్ కార్టెల్‌ని ఉగ్ర సంస్థగా పరిగణించింది.

### సోషల్ మీడియా ట్రంప్ పోస్ట్

ఎల్ మెంచోను పట్టుకునేందుకు మెక్సికో ఆర్మీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. ఇప్పుడు అమెరికా ఇంటెలిజెన్స్ సహకారంతో అతడి ఆచూకీని గుర్తించి, చుట్టుముట్టి మట్టుబెట్టారు. ప్రెసిడెంట్ ట్రంప్ కూడా డ్రగ్ డాన్ అంతంపై స్పందించారు. ఎల్ మెంచోని హతమార్చిన క్రెడిట్.. అమెరికా ఖాతాలో వేసేందుకు ప్రయత్నించారు. అన్ని విషయాల్లో తామే గ్తున్నామని, ఇలా అన్నింటిలోనూ విజయం సాధించడం న్యాయం కాదని.. సోషల్ మీడియాలో సరదాగా పోస్ట్ చేశారు. అమెరికా నిఘా వర్గాల సమాచారంతోనే.. డ్రగ్ మాఫియా డాన్ ఎల్ మెంచోని సైన్యం హతమార్చిందని వైట్ హౌజ్ కూడా ప్రకటించింది.

### మెక్సికోలో ఎల్ మెంచోపై ప్రత్యేక దాడి

ఎల్ మెంతో లాంటి నార్కో టెర్రరిస్టలని అగ్రరాజ్యం ఎప్పటికీ సహించదన్నారు. అయితే.. వాషింగ్టన్‌లోని మెక్సికో ఎంబసీ మాత్రం.. ఈ విషయంలో అమెరికా క్లెయిమ్‌ని తోసిపుచ్చింది. ఎల్ మెంచోని బంధించడానికి మెక్సికన్ స్పెషల్ ఫోర్సెస్ మాత్రమే ప్లాన్ చేశాయని తెలిపింది. ఈ విషయంలో అగ్రరాజ్యం ఇచ్చింది కొంత సమాచారం మాత్రమేనని తెలిపింది. ఇక.. మెక్సికోలో ఎల్ మెంచో డ్రగ్ కార్టెల్ సభ్యుచేస్తున్న అల్లర్లతో.. పరిస్థితుపూర్తిగా అదుపు తప్పాయి. హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారుసూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, స్థానిక అధికారులిచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుకోవాలన్నారు.


**బి.వి. రమణ**
**94407 40015**

### ఎల్ మెంచోపై 15 మిలియన్ డాలర్ల రివార్డు



ఎల్ మెంచోపై.. 15 మిలియన్ డాలర్ల రివార్డు కూడా ప్రకటించింది. మన కరెన్సీలో 136 కోట్లు. మెక్సికో డ్రగ్ కింగ్‌పిన్ ఎల్ చాపో తర్వాత.. ఆ దేశంలో అత్యంత పవర్‌ఫుల్ క్రిమినల్ బాస్‌గా ఎల్ మెంచో మారాడు. అజ్ఞాతంలో ఉంటూనే తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో తలదాచుకునేవాడు. గతంలో రెండుసార్లు అతడిని పట్టుకునేందుకు మెక్సికో దశా ప్రయత్నించగా.. తప్పించుకున్నాడు. సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేస్తూ.. అధికారు, శత్రువులను భయపెట్టేవాడు. ఎల్ మెంచో ఫ్యామిలీ కూడా అతని నేర ముఠాలో భాగమే. అతని భార్య రోజా లిండా వాలెన్సియా.. జాలిస్కో డ్రగ్ కార్టెల్ ఆర్థిక వ్యవహారా చూసేది. కొడుకు.. అమెరికాలో డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో జైశిక్ష అనుభవిస్తున్నాడు.

### మెక్సికో ప్రెసిడెంట్ చేతులెత్తేసిన పరిస్థితి



పోలీసుఏమైపోయారో తెలియదు.. ఆర్మీ ఏం చేస్తుందో అర్థం కావట్లేదు. మెక్సికో ప్రెసిడెంట్ కూడా ఏం చేయాలో తెలియక చేతులెత్తేసిన పరిస్థితునెలకొన్నాయ్. మొత్తానికి.. మెక్సికో మాత్రం మంటల్లో కాతోంది. డ్రగ్ డాన్ ఎల్ మెంచోని హతమార్చాడాన్ని జీర్ణించుకోలేని డ్రగ్ కార్టెల్స్ అంతా ఆగ్రహంతో ఊగిపోతున్నారు. రోడ్ల మీదకు వచ్చి బీభత్సం సృష్టిస్తున్నారు. కార్లను, భారీ ట్రక్కులను, బైకులను, ఇలా కనిపించిన వాహనానికల్లా నిప్పు పెడుతున్నారు. ప్రధాన సెంటర్లలో టైర్లని తగలబెట్టి, దట్టమైన పొగతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మెక్సికోలో పరిస్థితులన్నీ పూర్తిగా దిగజారిపోయాయ్. ఈ హింస ఎక్కడితో ఆగుతుందో అర్థం కావట్లేదు. చివరికి.. ఎయిర్-పోర్టుకూడా మూసేయాల్సిని పరిస్థితి వచ్చింది. మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో ఒసెగుయెరా అలియాస్ ఎల్ మంచో.. మెక్సికో ఆర్మీ ఆపరేషన్‌లో హతమయ్యాడు. దాంతో.. దేశంలో పెద్ద ఎత్తున ఆందోళను చెలరేగాయ్.

# టీమిండియాలో భారీ మార్పులు?

## నలుగురికి హ్యాండిచ్చిన సూర్య..


భారత క్రికెట్ జట్టు తదుపరి మ్యాచ్ ఫిబ్రవరి 26న చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో జరగనుంది. ఈ మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియాకు అత్యంత కీలకం. సూపర్-8 దశలో సెమీఫైనల్ ఆశలు నిలుపుకోవాలంటే ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవాల్సిన అవసరం ఉంది. జింబాబ్వేతో మ్యాచ్ కోసం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇప్పటికే తన వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.వచ్చే మ్యాచ్‌లో కొంతమంది కీలక ఆటగాళ్లు బెంచ్‌పైనే కూర్చునే అవకాశముంది. సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కలిసి కొత్త ప్లేయింగ్ ఎలెవన్‌పై ముద్ర వేసే సూచనలు కనిపిస్తున్నాయి. సెమీఫైనల్‌కు చేరాలంటే కేవలం గెలుపే కాకుండా భారీ తేడాతో విజయం సాధించాల్సిన పరిస్థితి భారత్ ముందు ఉంది.

**అభిషేక్ శర్మ - వాషింగ్టన్ సుందర్‌కు డ్రాప్..?**

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో రెండో మ్యాచ్ కోసం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ తమ అత్యంత దూకుడైన ఓపెనర్ అభిషేక్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించే అవకాశముంది. టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన అభిషేక్ కేవలం 15 పరుగులే చేశాడు. ఈ క్రమంలో వరుసగా మూడు సార్లు డక్‌గా ఔటయ్యాడు. అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వనున్నారని సమాచారం. ఇక వాషింగ్టన్ సుందర్‌ను కూడా బెంచ్‌పైనే ఉంచే అవకాశముంది. రెండు మ్యాచ్‌ల్లో అవకాశమిచ్చినా సుందర్ బ్యాట్‌తోనూ, బౌలింగ్‌తోనూ ప్రభావం చూపలేకపోయాడు. నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌ల్లో అతను వికెట్లు తీయలేకపోయాడు. బ్యాటింగ్‌లో కూడా పరుగులు రాలేదు.

**రింకూ సింగ్ - సిరాజ్ కూడా బెంచ్‌పై..!**

లోయర్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే ఆటగాడిగా పేరున్న రింకూ సింగ్‌ను కూడా జింబాబ్వేతో మ్యాచ్‌లో ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించే అవకాశముంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో రింకూ కేవలం 24 పరుగులు మాత్రమే చేశాడు. దక్షిణాఫ్రికాతో కీలక మ్యాచ్‌లో ఖాతా కూడా తెరవలేకపోయాడు.



పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో చేసిన అజేయ 11 పరుగుల ఇన్నింగ్స్‌ను తప్పితే, మిగతా టోర్నమెంట్ అంతా రింకూ బ్యాట్ నిశ్శబ్దంగానే ఉంది. అందుకే రింకూ స్థానంలో ఉప కెప్టెన్ అక్షర్ పటేల్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని సూర్యా నిర్ణయించవచ్చని సమాచారం. ఇక మొహమ్మద్ సిరాజ్ కూడా తదుపరి మ్యాచ్ ఆడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. సిరాజ్ స్థానంలో అర్షదీప్ సింగ్ -- జస్ప్రీత్ బుమ్రా పేస్ జోడీపై సూర్యా నమ్మకం పెట్టుకోవచ్చని అంచనా.

**సెమీఫైనల్ దారి మరింత కఠినం..**

భారత్‌కు సెమీఫైనల్ చేరే మార్గం ఇప్పటికే కఠినంగా మారింది. సూపర్-8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల భారీ ఓటమిని ఎదుర్కొంది. మరోవైపు వెస్టిండీస్ జింబాబ్వేపై 107 పరుగుల భారీ విజయం సాధించడంతో భారత్ పరిస్థితి మరింత కఠినమైంది.ప్రస్తుతం భారత్ నెట్ రన్ రేట్ మైనస్‌లో ఉంది. వెస్టిండీస్ మాత్రం భారీ విజయంతో మంచి రన్‌రేట్‌ను సాధించింది. అందుకే భారత్ సెమీఫైనల్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో పెద్ద తేడాతో గెలవాల్సిన అవసరం ఉంది.

**టీమిండియా స్క్వాడ్:**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ (ఉప కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్.

### అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్

# విజేత పుదుచ్చేరి... రన్నరప్‌గా అండమాన్...



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధానప్రతినిధి : అఖిల భారత పోలీస్ క్రీడా నియంత్రణ మండలి న్యూఢిల్లీ వారి ఆధర్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 2వ అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ 2025 - 26 పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఫిబ్రవరి 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు 5 రోజుల పాటు మూలపాడులోని ఏసీఏ గ్రౌండ్స్ లో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు ఈ టీ-20 క్రికెట్ టోర్నమెంటులో పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన టోర్నీ సెమీఫైనల్ లో పుదుచ్చేరి తమిళనాడును, అండమాన్.. తెలంగాణ జట్లను ఓడించి ఫైనల్ కు చేరాయి. రెండు కేంద్రపాలిత ప్రాంతాల జట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో పుదుచ్చేరి పోలీసు జట్టు అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్ జట్టు ను 43 పరుగుల తేడాతో ఓడించి విజేతగా నిలిచింది. అండమాన్ నికోబార్ ఐలాండ్స్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా, మొదట బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. జట్టులోని రాజు అత్యధికంగా 51 పరుగులు చేసి జట్టును పటిష్టమైన స్థితిలో నిలిపారు. అండమాన్ జట్టులోని యశ్వంతరావు అత్యద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 51 పరుగులిచ్చి 4 వికెట్లను పడగొట్టారు. జట్టులోని మరో బౌలర్ సి.పి. యాదవ్ పొదుపుగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి 2 వికెట్లను పడగొట్టారు. 193 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన అండమాన్ 18.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్లు శుభారంభం ఇచ్చినా ఆ తరువాత వచ్చిన బ్యాట్స్ మెన్లు తక్కువ స్కోర్లకే వెనుదిరగడంతో అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్ జట్టు రన్నరప్ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పుదుచ్చేరి బౌలర్లలో బి. ప్రభు అత్యద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి హ్యాట్రిక్ సాధించాడు. ఏపీఎస్పీ 6వ బెటాలియన్ గ్రౌండ్స్, మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్... టీ-20 క్రికెట్ టోర్నీ విజేత పుదుచ్చేరి మరియు రన్నరప్ గా నిలిచిన అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్ జట్లకు ట్రోఫీలు ప్రధానం చేశారు. టోర్నీ ఆసాంతం తన ఆల్ రౌండర్ నైపుణ్యంతో అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్ లో రాణించిన బి. ప్రభు "మ్యాన్ ఆఫ్ ద సిరీస్" మరియు "మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్"లుగా ఎంపికయ్యారు. బెస్ట్ బ్యాట్స్ మెన్ గా ఏపీకి చెందిన రాఘవ రాహుల్, బెస్ట్ బౌలర్ గా కే. పి. యాదవ్ అండమాన్, బెస్ట్ ఫీల్డర్ గా మహమ్మద్ హాసన్ అండమాన్ ఎంపికయ్యారు.

**డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ...**

ఐదు రోజుల పాటు అత్యంత ఉత్సాహభరితంగా సాగిన ఈ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ కు ప్రతీకగా నిలిచిందన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చి ఈ టోర్నీలో పాల్గొన్న పోలీసు జట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రేక్షకులను అలరించాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ పలు విద్యాసంస్థలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ టోర్నమెంట్ విజయవంతమైందని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయస్థాయి క్రీడా వేడుకలు, పోలీసు సిబ్బందిలో శారీరక ధృఢత్వం, మానిసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. మైదానంలో కనిపించిన క్రమశిక్షణ, పట్టుదల, పోరాటతత్వం సేవలోనూ ప్రతిబింబించాలని పోలీసు దళాలకు ఈ సందర్భంగా డీజీపీ దిశానిర్దేశం చేశారు. మొట్టమొదటిసారిగా ఈ టీ-20 పోలీస్ టోర్నమెంట్ ను డీడీ-స్పోర్ట్స్ ఛానెల్ 160 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఈ టోర్నీలో పాల్గొన్న పోలీసు జట్ల ఆట తీరు ప్రశంసనీయమని, క్రీడా స్ఫూర్తితో పోటీపడి టోర్నమెంట్ గౌరవాన్ని మరింత పెంచారని తెలిపారు. భవిష్యత్తులో క్రీడలను ప్రోత్సహిస్తూ.. పోలీసు దళాల ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాజధాని అమరావతి కేంద్రంగా నిర్మిస్తున్న స్పోర్ట్స్ సిటీకి ఈ పోటీలు స్ఫూర్తిగా నిలిచి భవిష్యత్తులో నిర్వహించబోయే జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా తెలుస్తాయన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుక... ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ టీమ్ ప్రదర్శించిన బైక్ విన్యాసాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి... సాహసకృత్యాలు అలరించాయి. టోర్నమెంట్లో పాల్గొన్న టీంల నుండి డీజీపీ హరీష్ కుమార్ గుప్తా గౌరవ వందనం స్వీకరించారు.ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఐజీపీ కె.వి.మోహనరావు, ఐపీఎస్ (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్) మరియు డిఐజీ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ కె.కె. అన్బురాజన్, ఐపీఎస్ ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి విశేషంగా కృషిచేసిన సిబ్బంది. మరియు గ్రౌండ్ స్టాఫ్ లను డీజీపీ అభినందిస్తూ వారందరికీ మెమోంటోలు అందజేశారు. అత్యంత ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా 5 రోజుల పాటు సాగిన సౌతాజోన్ పోలీస్ టీ 20 క్రికెట్ టోర్నమెంట్ ముగిసినట్లు డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ ప్రకటించడంతో పోటీలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ ఎన్. మదుసూదనరెడ్డి, ఐపీఎస్, ఐజీపీ కె.వి. మోహనరావు, ఐపీఎస్ (వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్), డీఐజీ అన్బురాజన్, ఐపీఎస్ (వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్), విజయవాడ నగర కమిషనర్ ఎస్వీ. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఐజీపీలు శ్రీకాంత్, బి. రాజకుమారి, రవిప్రకాష్ పోలీసు శాఖకు చెందిన తదితర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# విజయంపైనే ఫోకస్ చేయండి

- నెట్‌రన్‌రేట్‌పై అతిగా ఆలోచించొద్దు
- టీమిండియాకు రవిచంద్రన్ అశ్విన్ కీలక సూచన



టీ20 ప్రపంచకప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్.. లీగ్ స్టేజ్‌లో ఓటమి అనేది లేకుండా సూపర్-8కు చేరుకుంది. అయితే సూపర్-8లో తన తొలి మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికా చేతిలో భంగపాటుకు గురైంది. దీంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. జింబాబ్వేను వెస్టిండీస్ సైతం చిత్తు చిత్తుగా ఓడించడంతో సెమీస్ సమీకరణాలు మారిపోయాయి. ప్రస్తుతం భారత్ మిగిలిన రెండు మ్యాచ్‌లలో జింబాబ్వే, వెస్టిండీస్‌ను ఓడిస్తేనే ముందంజ వేసే అవకాశం ఉంది. అది కూడా నెట్ రన్ రేట్ భారీగా పెంచుకుంటూ గెలవాల్సి ఉంటుంది.ఈ పరిస్థితుల్లో టీమిండియా సూపర్-8లో ఆడే మిగతా రెండు మ్యాచ్‌లు డూ ఆర్ డై గా మారాయి. ఈ నేపత్యంలో మాజీ క్రికెటర్లు, పలువురు విశ్లేషకులు టీమిండియాకు సూచనలు చేస్తున్నారు. ఈ జాబితాలో టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేరిపోయాడు. అయితే అతడు కాస్త విభిన్నమైన సూచన చేశాడు. భారీగా నెట్ రన్ రేట్‌ను పెంచుకోవడంపై అతిగా ఆలోచించాల్సిన అవసరం లేదని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం రెండు మ్యాచ్‌లలో గెలవడంపైనే ఫోకస్ చేయాలని సూచించాడు."టీమిండియా నెట్ రన్‌రేట్ గురించి మరీ ఎక్కువగా ఆలోచించకూడదు. మనం మిగిలిన 2 మ్యాచులను తప్పనిసరిగా గెలవాలి. భారత టీ20 జట్టు యువ ఆటగాళ్లతో నిండి ఉంది. వారు ఒత్తిడిని ఎదుర్కోవాలి. కంగారు పడాల్సిన అవసరం లేదు. జింబాబ్వేతో మన జట్టుకు సమస్య ఎదురవుతుందని నేను అనుకోవడం లేదు. ఆ మ్యాచ్‌లో మనం మెరుగైన ప్రదర్శన చేస్తాం. ఏది ఏమైనా ఐసీసీ ప్రస్తుత పిచ్‌లను బ్యాలెన్స్‌గా రూపొందిస్తోంది. అటు బ్యాటర్లకు, ఇటు బౌలర్లకు ఇద్దరికీ అనుకూలంగా పిచ్‌లు ఉంటున్నాయి. దానికి తగ్గట్లుగానే ఆటగాళ్లు తమ ఆటతీరును మార్చుకోవాల్సి ఉంటుంది" అని అశ్విన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ తదుపరి రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందులో ఈనెల 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలో గెలిస్తేనే.. టీమిండియా సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయి.

### టీ20 ప్రపంచకప్

# 2026లో విండీస్ రికార్డుల మోత

- ఈ టోర్నీలో వరుసగా ఐదో మ్యాచ్‌లో విజయం
- వెస్టిండీస్ బ్యాటర్ల విధ్వంసం
- జింబాబ్వేపై 107 పరుగుల తేడాతో విక్టరీ



టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. సోమవారం జింబాబ్వేతో జరిగిన మ్యాచులో 107 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసి.. సెమీస్ అవకాశాలను గణనీయంగా పెంచుకుంది. ఈ మ్యాచులో వెస్టిండీస్ బ్యాటర్లు పెను విధ్వంసం సృష్టించారు. దీంతో ఆ జట్టు ఏకంగా 254 పరుగులు స్కోరు చేసింది. ఈ మ్యాచు ద్వారా వెస్టిండీస్.. టీ20 ప్రపంచకప్ చరిత్రలో పలు రికార్డులు బద్దలు కొట్టింది. రికార్డుల బూజు దులిపింది.ఈ టోర్నీలో వెస్టిండీస్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. లీగ్ స్టేజ్‌లో ఆడిన నాలుగు మ్యాచులలోనూ గెలుపొందింది. స్కాట్లాండ్, ఇంగ్లాండ్, నేపాల్, ఇటలీపై విక్టరీ సాధించింది. తాజాగా సూపర్-8లో జింబాబ్వేను సైతం మట్టికరిపించింది.

# కొత్త లోగోతో కొత్త ప్రారంభం




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026 సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ తమ కొత్త లోగోను అధికారికంగా విడుదల చేసింది. గతంలో నీలి రంగు థీమ్‌లో ఉన్న లోగోను మార్చి.. ఈసారి రెడ్ కలర్ ఆధారంగా రూపొందించిన కొత్త ఎంబ్లమ్ ను చేర్చింది. ఈ లోగోలో గరుడ, కిరీటం, ఏనుగు అనే మూడు ప్రధాన ప్రతీకలను చేర్చడం ద్వారా లక్నో నగరం, ఉత్తరప్రదేశ్ సంస్కృతి, గౌరవాన్ని ప్రతిబింబించేలా లోగోను డిజైన్ చేశారు.ఈ కొత్త లోగోలో గరుడ ప్రతీక జట్టుకు ఉన్న ధైర్యం, సవాళ్లను అధిగమించి ఎత్తులకు ఎదగాలనే లక్ష్యాన్ని సూచిస్తుంది. జట్టు ఆడే దూకుడు, విజయం సాధించాలనే ఆకాంక్షను ఇది ప్రతిబింబిస్తుందని ఫ్రాంచైజీ తెలిపింది. ఇంకా లోగోలోని కిరీటం జట్టు గౌరవం, బాధ్యతను సూచిస్తుంది. మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారి లక్షలాది అభిమానుల ఆశలు, విశ్వాసాన్ని మోస్తున్నామనే భావనను ఇది తెలియజేస్తుంది. ఇక లోగో మధ్యలో ఉన్న ఏనుగు శక్తి, సహనం, జ్ఞానం, ఐక్యతను సూచిస్తుంది. ఫలితాలు ఎలా ఉన్నా జట్టుకు అండగా నిలిచే అభిమానుల విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

జట్టు యజమాని, గ్రూప్ వైస్ చైర్మన్ శశ్వత్ గోయెంకా మాట్లాడుతూ.. ఈ లోగో తమకు భావోద్వేగపూరితమైన గుర్తింపు అని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు మొదటి రోజు నుంచే జట్టును ఆదరించారని, ఆ ప్రేమకు గుర్తుగా ఈ కొత్త లోగోను రూపొందించామని చెప్పారు. ఇది కేవలం డిజైన్ మార్పు మాత్రమే కాకుండా.. లక్నో నగర గౌరవాన్ని నిలబెట్టే వాగ్దానం అని ఆయన పేర్కొన్నారు.2026 సీజన్ కోసం లక్నో **సూపర్ జెయింట్స్ జట్టు (స్క్వాడ్)**

రిషభ్ పంత్, అబ్దుల్ సమద్, ఆయుష్ బడోని, ఎయిడెన్ మార్క్రం, మిచెల్ మార్ష్, మాథ్యూ బ్రెట్జ్కీ, నికోలస్ పూరన్, హిమ్మత్ సింగ్, షాహ్‌బాజ్ అహ్మద్, అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, అవేష్ ఖాన్, మొహ్సిన్ ఖాన్, దిగ్వేష్ రాథి, ఎం. సిద్ధార్థ్, ప్రిన్స్ యాదవ్, ఆకాష్ సింగ్, అర్జున్ టెండూల్కర్, మొహమ్మద్ షమీ, నమన్ తివారి, వనిందు హసరంగా, జోష్ ఇంగ్లిస్, అక్షత్ రఘువంశీ, అన్రిచ్ నోర్జే, ముకుల్ చౌదరి.

# క్లిష్ట పరిస్థితుల్లో టీమిండియా

- సెమీస్ చేరాలంటే జింబాబ్వే, విండీస్లపై భారత్ గెలవాల్సిందే!
- ఆసక్తికరంగా వరల్డ్ కప్ సూపర్ 8 సమీకరణాలు

టీ20 వరల్డ్ కప్ 2026 ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన దశకు చేరుకుంది. గ్రూప్ స్టేజ్లో పాకిస్థాన్, అమెరికా వంటి జట్లపై వరుస విజయాలు సాధించిన భారత్ సూపర్ 8 రౌండ్లో మాత్రం తడబడింది. సౌతాఫ్రికాతో జరిగిన తొలి మ్యాచులో ఓడిపోవడంతో సెమీస్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. అభిమానులందరూ భారత్ సులువుగా సెమీస్ చేరుతుందని ఆశించినా, ఇప్పుడు ప్రతి మ్యాచ్ చావోరేవో అన్నట్లుగా తయారైంది. ముఖ్యంగా నెట్ రన్ రేట్ భారీగా దెబ్బతినడం టీమ్ఇండియాకు పెద్ద మైనస్గా మారింది. అయితే భారత జట్టుకు ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి తిరిగి పుంజుకోవడం కొత్తేమీ కాదు. మరి స్కై సేన మళ్లీ తన విశ్వరూపం చూపిస్తుందా? సెమీస్ చేరాలంటే భారత్ ముందున్న మార్గాలేంటో ఇప్పుడు వివరంగా చూద్దాం.

**దెబ్బతిన్న రన్‌రేట్**

సూపర్ 8లో భాగంగా ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్లో భారత్కు చేదు అనుభవం ఎదురైంది. సఫారీలు నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ 76 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ ఓటమి వల్ల భారత్ ప్రస్తుతం 0 పాయింట్లతో గ్రూప్ 1లో మూడో స్థానంలో ఉంది. నెట్ రన్ రేట్ కూడా -3.800 కు పడిపోవడం ఆందోళన కలిగించే విషయం. మరోవైపు వెస్టిండీస్ (ం5.350), సౌతాఫ్రికా (ం3.800) నెట్ రన్ రేట్లో చాలా మెరుగ్గా ఉండి మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ స్థితిలో భారత్ తన తదుపరి మ్యాచుల్లో కేవలం గెలవడమే కాకుండా భారీ ఆధిక్యంతో విజయం సాధించాల్సి ఉంటుంది.

**చావోరేవో తేల్చుకోవాల్సిన సమయం**

భారత్ తన తదుపరి సూపర్ 8 మ్యాచ్ను ఫిబ్రవరి 26న చెన్నై వేదికగా జింబాబ్వేతో ఆడనుంది. జింబాబ్వే కూడా తన తొలి మ్యాచులో వెస్టిండీస్ చేతిలో ఓడిపోయి పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఈ మ్యాచ్ భారత్కు ఎంతో కీలకం. సెమీస్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచులో భారత్ కచ్చితంగా గెలవాలి. జింబాబ్వే జట్టు గ్రూప్ స్టేజ్లో ఆస్ట్రేలియా, శ్రీలంకలను ఓడించి మంచి ఫామ్లో ఉండటంతో టీమ్ఇండియా ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ఫలితం దారుణంగా ఉంటుంది. భారీ రన్ రేట్తో గెలిస్తేనే వెస్టిండీస్తో జరగబోయే ఆఖరి పోరుకు టీమ్ఇండియాకు కలిసొచ్చే అవకాశం ఉంటుంది.

**సెమీస్ బెర్త్ ఎవరిదో తేల్చే మ్యాచ్**

ప్రస్తుతం గ్రూప్ 1లో వెస్టిండీస్ జట్టు అత్యంత బలంగా కనిపిస్తోంది. జింబాబ్వేపై సాధించిన భారీ విజయంతో 2 పాయింట్లను సాధించడమే కాకుండా ం5.350తో అత్యుత్తమ నెట్ రన్ రేట్ను కలిగి ఉంది. గ్రౌండ్ ఏదైనా విండీస్ ఆటగాళు రెచ్చిపోతున్నారు. మార్చి 1న ఈడెన్ గార్డెన్స్లో భారత్ తన చివరి సూపర్ 8 మ్యాచ్లో వెస్టిండీస్తో తలపడనుంది. బహుశా ఈ మ్యాచే సెమీస్ బెర్త్ ఎవరిదో తేల్చే ఫైనల్ మ్యాచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ మ్యాచులో గెలిచి సెమీస్కి వెళ్లాలంటే భారత్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మరింత బలంగా పోరాడాలి.



**గ్రూప్ 2 ఇది పరిస్థితి**

గ్రూప్ 2లో ఇంగ్లాండ్ జట్టు శ్రీలంకపై గెలిచి 2 పాయింట్లతో టేబుల్ టాపర్గా ఉంది. అయితే న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఇరు జట్లకు తలో పాయింట్ లభించింది. ప్రస్తుతం పాక్, కివీస్ రెండో స్థానంలో ఉన్నాయి. శ్రీలంక మాత్రం ఇంగ్లాండ్ చేతిలో ఓడిపోయి పాయింట్లు లేకుండా చివరి స్థానంలో ఉంది. ఈ గ్రూప్లో కూడా సెమీస్ బెర్త్ కోసం గట్టి పోటీ నెలకొంది. భారత్ ఒకవేళ సెమీస్ చేరితే ఇక్కడి టాప్ టూ జట్లలో ఒకరితో తలపడాల్సి ఉంటుంది.భారత్ సెమీస్ చేరాలంటే పక్కా సమీకరణాలివే భారత్ సెమీ ఫైనల్స్కు అర్హత సాధించాలంటే రాబోయే రెండు మ్యాచుల్లో (జింబాబ్వే, వెస్టిండీస్) కచ్చితంగా గెలవాలి.ఒకవేళ భారత్ రెండు మ్యాచుల్లో గెలిస్తే 4 పాయింట్లు సాధిస్తుంది.అప్పుడు సౌతాఫ్రికా లేదా వెస్టిండీస్ తమ తదుపరి మ్యాచుల్లో ఓడిపోతే భారత్ సులువుగా సెమీస్కి వెళుతుంది.ఒకవేళ పాయింట్లు సమమైతే నెట్ రన్ రేట్ కీలకం అవుతుంది.ప్రస్తుతం భారత్ రన్ రేట్ మైనస్లో ఉన్నందున, జింబాబ్వేపై కనీసం 100 పరుగుల తేడాతో లేదా భారీ ఓవర్ల తేడాతో గెలవాలి.అలాగే వెస్టిండీస్తో కూడా భారీ తేడాతో గెలిస్తేనే అడ్వాంటేజ్ ఉంటుంది.ఏదేమైనా టీమ్ఇండియాకు సూపర్ 8 ప్రయాణం అగ్నిపరీక్షలా మారింది. మరి జింబాబ్వేపై గెలిచి భారత్ మళ్లీ పాత వైభవాన్ని చాటుతుందో లేదో చూడాలి.

# సినిమా



## విష్ణు విన్యాసంలో డిఫరెంట్ షేడ్స్ క్యారెక్టర్ చేశాను

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు హీరోగా రియన్ జాయ్ వుడ్ విష్ణు విన్యాసంతో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ నయన్ సారిక విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది ?**

చాలా డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. నా క్యారెక్టర్‌కి చాలా షేడ్స్ వుంటాయి. కొంచెం ఫీమేల్ డామినేటింగ్‌గా ఉంటుంది. ఫస్ట్ ఆఫ్‌లో అబ్బాయిలకి కాస్త చిరాకు కలిగిస్తుంది. కానీ దానికి కారణం ఏమిటో సెకండ్ హాఫ్‌లో రివీల్ అయిన తర్వాత ఆ క్యారెక్టర్‌ని అందరూ అర్థం చేసుకొని, ఇష్టపడతారు.

**మీ క్యారెక్టర్ టీజర్‌లో కాస్త బోల్డ్‌గా కనిపించింది కదా.. ఆ క్యారెక్టర్ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**

నాకు ఆ క్యారెక్టర్ చెప్పినప్పుడు చాలా నచ్చింది. టీజర్‌లో చూసిన కొన్ని సీన్స్ క్యారెక్టర్ కోసం కథ కోసం చాలా ఇంపార్టెంట్. ఇందులో మనీషా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను జీవితంలో చాలా బాధలు ఎదుర్కొన్న అమ్మాయి. ఒక పాయింట్ వచ్చిన తర్వాత జీవితాన్ని హాయిగా బ్రతకాలనుకునే అమ్మాయి. నేను కాలేజీలో ఫ్యాకల్టీగా కనిపిస్తాను. విష్ణు గారి క్యారెక్టర్ కూడా అదే. ఇద్దరు లెక్చరర్స్ మధ్య జరిగే ప్రేమ కథ. స్టూడెంట్స్, యూత్ చాలా బాగా కనెక్ట్ అవుతారు.

**మీ మూవీ జర్నీ గురించి?**

మాది మహారాష్ట్ర. నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. తెలుగులోనే నా ఫస్ట్ సినిమా చేశాను. అక్కడి నుంచి ఇది ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. భవిష్యత్తులో కూడా తెలుగు సినిమాలకి నా మొదటి ప్రాధాన్యత. గంగం గణేశా, ఆయ్, క లాంటి వరుస విజయాలు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విష్ణు విన్యాసం కూడా నాకు మరింత మంచి పేరు తీసుకొస్తుందని భావిస్తున్నాను. తెలుగు ఆడియన్స్ ఇస్తున్న సపోర్టుకి కృతజ్ఞతలు. మంచి కథా బలం, పాత్ర బలం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాను. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలనుంది. అలాగే మంచి పెర్ఫార్మన్స్, కొత్తదనం వున్న సినిమాలు చేయాలని ఉంది.

**శ్రీ విష్ణుతో పనిచేయడం ఎలా అనిపించింది?**

ఆయనతో వర్క్ చేయడం వెరీ ఫన్ జర్నీ. ఆయన చాలా జోవియల్ పర్సన్. ఆయన సరదాగా మాట్లాడుతుంటే వినడానికి చాలా హాయిగా ఉంటుంది. చాలా మాటలు గుర్తుండిపోతాయి. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్.

**డైరెక్టర్ గురించి?**

డైరెక్టర్ మారుతి చాలా టాలెంటెడ్. ఆయన కథ చెప్పినప్పుడే చాలా ఎంజాయ్ చేశాను. తను చాలా క్లారిటీ ఉన్న ఫిలిం మేకర్. నా క్యారెక్టర్ కోసం చాలా గైడ్ చేశారు. ఆయనతో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది

**నిర్మాతల గురించి?**

నిర్మాతలు చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. ప్రతి విషయంలో సపోర్ట్ చేశారు. సుమంత్ గారు సినిమాకు కావలసిన ప్రతిదీ సమకూర్చారు.

**మీ ఫేవరేట్ సాంగ్?**

రధన్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. అలాగే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా చాలా బాగుంటుంది ఇందులో బ్రేకప్ సాంగ్ నాకు చాలా ఇష్టం. అలాగే మొదలే మొదలే పాట నా ఫేవరెట్.

## విట్నెస్ ది మెంటల్ మ్యాడ్‌నెస్ ఆయా షేర్



కల్ట్ హిట్ దసరా తర్వాత నేచురల్ స్టార్ నాని, విజనరీ మేకర్ శ్రీకాంత్ ఓదెల బిగ్ కాన్వాస్‌పై బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ కోసం రెండవసారి కలిశారు. ఎస్ఎల్‌వి సినిమాస్ ఆధ్వర్యంలో సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని ప్రపంచ స్థాయి స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ ప్రోమో వైరల్ అయ్యింది, అంచనాలను భారీగా పెంచింది. ఇప్పుడు విడుదలైన ఫుల్ ట్రాక్ తో రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అంచనాలని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళాడు. ట్రైబల్ పర్కషన్‌తో పాటు గ్రిటీ ఎలక్ట్రానిక్ సౌండ్స్‌ను కలిపి, ప్రైమల్ ఎనర్జీతో నిండిన థండరస్ మ్యూజిక్ ఎక్స్ పీరియన్స్ అందించాడు. సెలబ్రేషన్, అడ్రినలిన్ రెండింటి మేళవింపుగా ఈ పాట అదిరిపోయింది. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం “షేర్” రాకను సూచిస్తూ ఆకలి, ఆధిపత్యం, టెర్రిటోరియల్ పవర్‌తో నిండిన అంథమ్‌లా వినిపిస్తుంది. ప్రముఖ తెలంగాణ జానపద గాయకులు అడ్డుల జంగిరెడ్డి, అకునూరి దేవయ్య తమ శక్తివంతమైన వోకల్స్ తో పాటను మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. నాని ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ పాటలో హైలెట్‌గా నిలిచింది. జడలతో కూడిన హెయిర్ స్టైల్, గడ్డం, రెడ్ బ్లేజర్‌తో రగ్గడ్ లుక్‌లో ఆయన వారియర్, ఐకాన్‌లా కనిపిస్తున్నారు. నాయకుడిగా ఆయన స్వాగ్ అదిరిపోయింది.

## జగదీకవీరుడి నిర్మాతగా అతిలోకసుందరి



అతిలోక సుందరిగా శ్రీదేవి పేరు గడించింది. చిన్ననాటి నుంచే నటనను ప్రాణంగా భావించి వెండి తెర మీద రాణించింది శ్రీదేవి. ఎవరి పక్కన అయితే మనవరాలిగా కూతురుగా నటించిందో ఆ అగ్ర నటులతోనే తరువాత కలాంలో హీరోయిన్‌గా నటించి సూపర్ హిట్లు కొట్టింది. వారికి సరైన జోడి అన్న పేరు తెచ్చుకుంది. శ్రీదేవి తెలుగు తెరకు ఎప్పటికీ ఎవర్ గ్రీన్ హీరోయిన్ గానే ఉండిపోయారు అని చెప్పాలి. బాలీ వుడ్‌లో టాప్ : బాలీవుడ్ లో సౌత్ నుంచి వెళ్ళి అత్యధిక కాలం నంబర్ వన్ హీరోయిన్‌గా రాణించడం అంటే మాటలు కాదు. అది శ్రీదేవి మాత్రమే సాధించారు. అలా వన్ అండ్ ఓన్లీగా ఆమె రికార్డు క్రియేట్ చేశారు. శ్రీదేవి కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన చిత్రాలు ఉన్నాయి. నటనకు ప్రదానమైన చిత్రాలలో వసంత కోకిల చాలు ఆమె ప్రతిభ ఏమిటో చెప్పడానికి గ్లామర్ తో పాటు నటన కూడా కలిగి ఉన్న అరుదైన హీరోయిన్‌గా శ్రీదేవిని అంతా చెబుతారు. ఎన్టీఆర్ నుంచి : ఇదిలా ఉంటే ఎన్టీఆర్ నుంచి మొదలెడితే అక్కినేని, కృష్ణ, శోభన్ బాబు, కృష్ణం రాజు ఇలా అలనాటి టాప్ ఫైవ్ తో శ్రీదేవి నటించి సరికొత్త రికార్డు క్రియేట్ చేశారు. ఆ తరువాత వరసలో మెగాస్టార్ చిరంజీవితో ఆమె నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి బ్లాక్ బస్టర్ మూవీ. ఈ రోజుకీ అది వెండి తెర కావ్యంగా ఉంటుంది అంటే అతిశయోక్తి కాదు, చిరంజీవి శ్రీదేవి మొదటిసారి నటించింది మోసగాడు మూవీలో. ఇందులో శోభన్ బాబు హీరోగా నటిస్తే చిరంజీవి విలన్‌గా కనిపిస్తారు. శ్రీదేవి ద్విపాత్రాభినయం చేస్తుంది. శ్రీదేవికి చిరంజీవికి ఈ సిని మాలో ఒక సాంగ్ ఉంటుంది. కె రాఘవేంద్రరావు డైరె క్టర్. ఆ తరువాత రాణికాసుల రంగమ్మలో కూడా చిరం జీవి శ్రీదేవి జంటగా నటించారు. శ్రీదేవి స్వీయ నిర్మా ణంలో: ఇదిలా ఉంటే శ్రీదేవి తాను నిర్మాతగా హీరోయి న్‌గా మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఒక సిని మాను రూపొందించాలను కున్నారు. ఇక ఈ సినిమా కూడా 1990 దశకంలో జగదేకవీరుడు అతిలోకసుందరి కాంబి నేషన్‌ని రిపీట్ చేస్తూ వస్తున్నది కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాకు వజ్రాల దొంగ అని పేరు పెట్టారు. దర్శకుడు ఏ కోదండ రామిరెడ్డి. పూజా కార్యక్రమాలు జరిగాయి. షూటింగ్ దశలోనే ఈ మూవీ ఆగిపోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ మూవీ ఏ కారణాల వల్ల ఆగిపోయిందో ఇదమిద్ధంగా వివరాలు అయితే ఎవరికీ తెలియదు కానీ శ్రీదేవి నిర్మా తగా హీరోయిన్ గా చిరంజీవి హీరోగా ప్లాన్ చేసిన భారీ చిత్రం వజ్రాల దొంగ రిలీజ్ అయి ఉంటే ఎన్నో రికార్డులు క్రియే ట్ చేసి ఉండేది అని అంతా అంటారు. అలా శ్రీదేవి తెలుగులో ఒక భారీ చిత్రం తీయాలను తాను నిర్మాతగా కూడా సూపర్ సక్సెస్ కావాలని అనుకున్నా అది నెరవేరలేదు.

## ‘బ్యాండ్ మేళం’ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను... శివాజీ

‘కోర్ట్’ ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం ‘బ్యాండ్ మేళం’. సతీష్ జవ్వాజీ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ సినిమాని మార్చి 13న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి తమన్, శివాజీ ముఖ్య



అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. శివాజీ మాట్లాడుతూ .. “బ్యాండ్ మేళం’ మంచి లవ్ స్టోరితో తెరకెక్కింది. ఇందులో కూడా నన్ను ఓ పాత్ర చేయమని అడిగారు. కానీ రొటీన్ అవుతుందని వద్దని చెప్పాను. శ్రీదేవీ చాలా మంచి నటి. రోషన్ మంచి టాలెంట్ ఉన్న యాక్టర్. భవిష్యత్తులో గొప్ప స్థాయికి వెళ్తాడు. ‘బ్యాండ్ మేళం’తో వీరంతా మరోస్థాయికి వెళ్లబోతోన్నారు. ‘కోర్ట్’ మార్చి 13న ప్రీమియర్ వేసి హిట్టు కొట్టాం. ఇప్పుడు ‘బ్యాండ్ మేళం’ మార్చి 13న రాబోతోంది. ఇది కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

## వయలెంట్ లవ్ స్టోరీ కాక్రోచ్

సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్, వలస వంటి చిత్రాలతో అవార్డులు, ప్రేక్షకుల రివార్డులు అందుకున్న డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి రూపొందిస్తున్న తాజా చిత్రం కాక్రోచ్. ఈ చిత్రంలో అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాక్రోచ్ సినిమాను శ్రీ లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ పై బి.బాపిరాజు, ముతుకి నాగసత్యనారాయణ నిర్మిస్తున్నారు. అన్ని




కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా మార్చి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బి.బాపిరాజు మాట్లాడుతూ – సునీల్ కుమార్ రెడ్డి గారితో మా కాంబినేషన్ లో విజయవంతమైన మంచి చిత్రాలు చేశాం. మేము కలిసి చేస్తున్న మరో డిఫరెంట్ మూవీ ఇది. సమాజంలో జరుగుతున్న ఘటనలకు వాస్తవిక రూపంగా ఈ సినిమాను నిర్మించాం. ఈ చిత్ర నిర్మాణ సమయంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నాం. సహజమైన లొకేషన్స్ లో రిస్కీ షూటింగ్ కానీ చేశాము. సెన్సార్ వారు మా మూవీకి ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. మార్చి 6వ తేదీన మా మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. మా డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి గారు స్క్రిప్ట్ చెప్పినదానికంటే ఇంకా బాగా సినిమాను తెరకెక్కించారు. రొటీన్ సినిమాలు చూసి విసిగిపోయిన ప్రేక్షకులకు మా మూవీ కొత్తదనం ఇస్తుంది అన్నారు.

## నాని, సుజీత్ బ్లడీ రోమియో

వరుస బ్లాక్ బస్టర్స్‌తో దూసుకెళ్తున్న నేచురల్ స్టార్ నాని, తన తదుపరి ప్రతిష్టాత్మక వెంచర్ – నాని34 టైటిల్‌ని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి బ్లడీ రోమియో అనే టైటిల్ పెట్టారు. యూనానిమస్ ప్రొడక్షన్స్, నిహారిక ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్స్ పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఇటీవల ఓజీతో భారీ విజయాన్ని అందించిన స్టైలిష్ ఫిల్మ్ మేకర్ సుజీత్ తో నానికి ఇది ఫస్ట్ కొలాబరేషన్. నాని పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అద్భుతమైన కామిక్-నోయిర్ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. డీప్ పర్‌పుల్స్, బ్లడ్ రెడ్స్‌తో నిండిన ఈ విజువల్ లాంగ్వేజ్, ఈ సినిమా యాక్షన్‌తో పాటు స్టైలిష్ ఎస్తెటిక్






ఫ్లేర్‌కి ప్రాధాన్యం ఇస్తుందని ప్రజెంట్ చేస్తోంది. ప్రోమోలో హీరోను కిచెన్‌లో పరిచయం చేస్తారు. వెన్నెల కిషోర్ వాయిస్ ఓవర్ కొనసాగుతున్న కొద్దీ, అతని “రెసిపీలు” నిజానికి అతని హింసాత్మక స్వభావానికి ప్రతీకలని రివిల్ అవుతుంది. “చిటికెడు కరుణ”, “పిడికెడు కోపం” లాంటి పదార్థాలను వంటకంగా చూపిస్తూ, తన జీవితాన్ని ఓ మాస్టర్ చెఫ్ లా ప్రజెంట్ చేశారు. సాధారణంగా కనిపించే ప్రెషర్ కుక్కర్ ఒక్కసారిగా టైమ్ బాంబ్‌లా పేలిపోవడం ద్వారా “గ్యాంగ్‌స్టర్’స్ డెన్”ను ధ్వంసం చేయడం ఈ కాన్సెప్ట్‌కి క్లైమాక్స్‌గా నిలిచింది. నాని పాత్ర ఒక ఫైటర్‌గా కాకుండా, దేనికి లెక్క చేయని పవర్ లా బయటి రావడం అదిరిపోయింది. “.1 ” నుంచి “.1 ”గా మారే కార్డ్ రివీల్ సినిమా నేచర్ ని అద్భుతంగా చూపిస్తుంది. చివర్లో లండన్ నేపథ్యంతో వాష్‌రూమ్ నుంచి బయటకు వస్తూ, మండుతున్న కార్డ్‌తో సిగార్ వెలిగించే నాని షాట్ అతని “రోమియో”, డేంజర్ పర్సోనా ప్రజెంట్ చేసింది. ప్రోమో చివర్లో లండన్ స్కైలైన్ సిల్హౌట్స్‌తో బ్లడీ రోమియో టైటిల్ లోగో కనిపించింది. ఇది సుజీత్, నాని “నేచురల్ స్టార్” ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని చూస్తున్నాడని సూచిస్తుంది. దర్శకుడి భారీ యాక్షన్ స్టైల్‌తో పాటు, డార్క్ కామెడీ టచ్ ఉన్న క్యారెక్టర్ డ్రైవన్ కథను మిళితం చేసి అద్భుతంగా చూపించబోతున్నారు.

## స్ట్రీమింగ్‌కి రెడీ అయిన ఓం శాంతి శాంతి శాంతిః

సరికొత్త కంటెంట్ తో వ్యూయర్స్‌ను ఎంగేజ్ చేస్తున్న ఆహా ఓటీటీ మరో సూపర్ హిట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను అందించనుంది. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన హోల్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఓం శాంతి శాంతి శాంతిః సినిమా మార్చి 4వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. గోల్డ్ సబ్ స్క్రైబర్స్ 24 గంటల ముందుగానే ఈ చిత్రాన్ని చూడొచ్చు. ఓం శాంతి శాంతి శాంతిః సినిమాను నూతన దర్శకుడు ఎ.ఆర్. సజీవ్ రూపొందించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ మూవీని నిర్మించగా, కిశోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరించారు. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 30న ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని దక్కించుకుంది.





## మార్చి 12న ‘మేడ్ ఇన్ కొరియా’ స్ట్రీమింగ్

రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో, రా.కార్తిక్ రచించి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మేడ్ ఇన్ కొరియా. ప్రియాంక మోహన్, దక్షిణ కొరియా నటుడు పార్క్ హై-జిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తమిళనాడులోని ఒక చిన్న పట్టణానికి చెందిన శెన్బా కి దక్షిణ కొరియాకు వెళ్లాలని గొప్ప కల ఉంది. ఆ కల నిజమవుతున్న ప్రయాణాన్ని చూపించే ‘మేడ్ ఇన్ కొరియా’ చిత్రం మార్చి 12న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

దర్శకుడు రా.కార్తిక్ మాట్లాడుతూ, “కొరియన్, తమిళ సంస్కృతుల మధ్య ఉన్న చారిత్రక అనుబంధాలు నాకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. అదే ప్రేరణతో ఈ కథను రూపొందించాను. ‘మేడ్ ఇన్ కొరియా’ హత్తుకునే స్లైస్-ఆఫ్-లైఫ్ చిత్రం. భాషల్ని దాటి ప్రపంచ సంస్కృతులను కలుపుతున్న కథలను ప్రోత్సహించిన నెట్‌ఫ్లిక్స్‌కు ధన్యవాదాలు,” నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ, “దక్షిణాది కథలపై మా దృష్టిని మరింత బలోపేతం చేస్తూ, స్థానిక సంస్కృతిలో నాటుకుపోయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను తాకే కథలను తీసుకురావడమే మా లక్ష్యం. తమిళనాడులోని ఒక చిన్న గ్రామం నుంచి వచ్చిన అమ్మాయి కలల కథగా ‘మేడ్ ఇన్ కొరియా’ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో ప్రియాంక మోహన్ నటిస్తూ, శెన్బా భావోద్వేగ ప్రయాణాన్ని ఎంతో సహజంగా ఆవిష్కరించారు. ‘స్క్విడ్ గేమ్’ ఫేమ్ దక్షిణ కొరియా నటుడు పార్క్ హ్యే-జిన్‌తో పాటు నో హో-జిన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## ప్రపంచ బౌద్ధ దేశాలలో షూటింగ్ చేస్తున్న కింగ్ బుద్ధ

ప్రపంచ శాంతి కోసం థాయ్‌లాండ్‌కి చెందిన 60 మంది బౌద్ధ బిక్షువులు(మాంక్స్) 22 నుంచి కర్ణాటక రాష్ట్రం స్వర్ణభూమి నుండి తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ బుద్ధభూమి వరకు 400 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ నుంచి తుర్కయాంజిల్ వరకు 17 కిలోమీటర్ల పాదయాత్రలో కింగ్ బుద్ధ హాలీవుడ్ డైరెక్టర్ సత్యా రెడ్డి మరియు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం కింగ్ బుద్ధ చిత్రాన్ని హాలీవుడ్‌లో నిర్మిస్తున్న డైరెక్టర్ సత్యారెడ్డి మెడలో గౌతమ బుద్ధుడి లాకెట్‌ను ధరింపజేసిన సీనియర్ మాంక్స్ కింగ్ బుద్ధ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఘనవిజయం సాధించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సత్యారెడ్డి మాట్లాడుతూ... అమెరికాలో



ప్రారంభించిన “కింగ్ బుద్ధ హాలీవుడ్ చిత్రాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నాము. ఇప్పటివరకు 10 దేశాల్లో షూటింగ్ పూర్తయ్యిందని, ఇంకా 15 బౌద్ధ దేశాల్లో చిత్రీకరణ జరపాల్సి ఉంది. ఈ చిత్రంలో హాలీవుడ్, బాలీవుడ్, సౌత్ ఇండియా ప్రముఖ నటులు నటిస్తున్నారు. ప్రపంచంలోని 100కి పైగా భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనే లక్ష్యం అన్నారు. సత్యారెడ్డి మాట్లాడుతూ గత తన “ఉక్కు సత్యాగ్రహం” శతదినోత్సవ చిత్రంలో విప్లవకవి గద్దర్ తనకి బౌద్ధిజం నేర్పించారని,అందుకే ఆ సినిమాలో బుద్ధుని సీన్లు పెట్టమని చెప్పారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో గౌతమ బుద్ధునిపై “కింగ్ బుద్ధ” చిత్రాన్ని నిర్మించడం ఒక గొప్ప ఛాలెంజ్‌గా భావిస్తున్నట్లు తెలిపారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044